నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక

మెదక్

సోమవారం | 17 జూన్ 2024 | www.navatelangana.com

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

నవతెలంగాణ-కొమురవెల్లి



పూర్వ విద్యార్థుల అపూర్వ కలయిక మధుర జ్ఞాపకాలతో ఆనందపరవశంతో సాగింది. ఆదివారం కొమురవెల్లి జడ్పీ ఉన్నత పాఠశాలలో 2007-08 విద్యాసంవత్సరంలో పదోతరగతి చదువుకున్న పూర్వ విద్యార్థులు ఒక్కచోట చేరి సందడి చేశారు. ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకుంటూ బాగోగులు తెలుసుకున్నారు. చదువుకున్న రోజుల్లో జ్ఞాపకాలు నెమరేసుకుంటూ ఉబ్బి తబ్బిబయ్యారు. అప్పటి గురువులను ఘనంగా సన్మానించారు. అందరూ కలిసి విందు భోజనాలు ఆరగించారు. గ్రూప్ ఫొటోలు దిగి కొంగొత్త జ్ఞాపకాలు పథిలం చేసుకున్నారు. ఆయా కార్యక్రమాల్లో అప్పటి ఉపాధ్యాయులు, పూర్వవిద్యార్థులు పాల్గొన్నారు.

బక్రీద్ సందర్భంగా ప్రజావాణి రద్దు

నవ తెలంగాణ-మెదక్ టౌన్



బక్రీద్ పండగ ప్రభుత్వ సెలవు అయినందున సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమం రద్దు చేసినట్లు కలెక్టర్ రాహుల్ రాజ్ తెలిపారు. ప్రభుత్వ సెలవున ప్రజావాణి కార్యక్రమం రద్దు చేయడం జరిగిందని, ప్రజలు ఈ విషయాన్ని గమనించి దరఖాస్తులు ఇచ్చేందుకు కలెక్టరేట్‌కు ఎవరు కూడా రావొద్దని ఆయన సూచించారు.

మెదక్ బంద్ ప్రశాంతం



•బందోబస్తును పర్యవేక్షించిన ఐజీ

నవ తెలంగాణ-మెదక్ టౌన్

శనివారం ఇరు వర్గాల మధ్య ఘర్షణ, పరస్పర దాడుల నేపథ్యంలో మెదక్ పట్టణంలో ఉద్రిక్త పరిస్థితి నెలకొన్నది. ఈ క్రమంలో బీజేపీ, బీజేవైఎం ఆదివారం మెదక్ పట్టణ బంద్‌కు పిలుపునిచ్చాయి. ఈ మేరకు వ్యాపార, వాణిజ్య సంస్థలు, పెట్రోల్ బంక్‌లు, హెూటళ్లు, దుకాణాలు స్వచ్ఛందంగా మూసివేశారు. ఆర్టీసీ బస్సులు యదావిధిగా నడిచాయి. బస్టాండ్‌లు, చౌరస్తాల వద్ద పోలీస్ పికెట్‌లు ఏర్పాటు చేయడంతో పాటు, పట్టణంలో పెట్రోలింగ్ నిర్వహించారు. మల్టీజోన్ ఐజీ రంగనాథ్ మెదక్ పట్టణానికి వచ్చి, ఎస్పీ బాలస్వామితో కలిసి పరిస్థితిని సమీక్షించారు. శనివారం జరిగిన సంఘటనతో సంబంధం ఉన్న ఇరు వర్గాలకు చెందిన పలువురిని పోలీసులు అరెస్ట్ చేశారు.

ప్రజలను ఎలాంటి ఇబ్బందులకు గురి చేయవద్దు

ఐజీ రంగనాథ్





ఇరువర్గాల మధ్య గొడవల నేపథ్యంలో ఆదివారం మెదక్ పట్టణ పోలీస్ స్టేషన్‌లో పీస్ కమిటీ సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సమావేశానికి హాజరైన మల్టీజోన్ ఐజీ రంగనాథ్ మాట్లాడుతూ ఒక వర్గం మరో వర్గాన్ని రెచ్చగొట్టుకోవడం, గొడవలు పడటం, దుకాణాలు, ఆసుపత్రులపై దాడులు చేయడం మంచి పద్ధతి కాదన్నారు. ప్రజలను ఎలాంటి ఇబ్బందులకు గురి చేయవద్దు అని అన్నారు. సమాజంలోని అన్ని వర్గాల వారు శాంతి సామరస్యంతో మెలగాలని సూచించారు. ఏదైనా సమస్య ఉంటే పోలీసుల దృష్టికి తీసుకువచ్చి సామరస్యంగా పరిష్కారం అయ్యేలా చూడాలన్నారు. ఈ సమావేంలో ఎస్పీ బాలస్వామి, ఏఎస్పీ మహెందర్, మున్సిపల్ చైర్మెన్ చంద్రపాల్, మాజీ చైర్మెన్ బట్టి జగపతి, కౌన్సిలర్ లక్ష్మీనారాయణ గౌడ్, బీజేపీ జిల్లా నాయకులు నందారెడ్డి, గడ్డం కాశీనాథ్, మైనార్టీ నాయకులు ఖాజా మొహినొద్దీన్, జావేద్ మౌలానా, భారత్, ఆరీఫ్, హఫీజ్, అంజద్, అఫ్జల్, అహ్మద్ బేగ్, షాహెద్ అలీ తదితరులు పాల్గొన్నారు.

ఎంపీ ఆరోపణలు అవాస్తవం

నవతెలంగాణ-ములుగు



మెదక్ ఎంపీ రఘునందన్ రావుపై ములుగు మండల బీఆర్ఎస్ నాయకులు వంటిమామిడి మార్కెట్ మాజీ చైరన్ జహంగీర్ మండిపడ్డారు. ఇటీవల సిద్ధిపేటలో రఘునందన్ రావు క్షీరసాగర్ లో మాట్లాడుతూ వెంకట్రామిరెడ్డికి అక్రమ ఆస్తులు ఉన్నాయని మాట్లాడడం సరైంది కాదన్నారు. అది పూర్తిగా అవాస్తవమన్నారు వెంకట్రాంరెడ్డికి అక్రమ ఆస్తులు ఉంటే నిరుపేదలకు పంచడానికి తాము సిద్ధంగా ఉన్నామన్నారు

నీట్ పరీక్ష లీకేజీ వల్ల 12 లక్షల మంది విద్యార్థులకు అన్యాయం

- ఎన్ఎస్‌యుఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మన్నె జీవన్

నవతెలంగాణ-సిద్దిపేట



నీట్ పరీక్ష పేపర్ లీకేజ్ వల్ల 12 లక్షల మంది విద్యార్థులకు అన్యాయం జరిగిందని ఎన్ఎస్ యుఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మన్నే జీవన్ అన్నారు. సిద్దిపేట జిల్లా కేంద్రంలో సిద్దిపేట నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ క్యాంపు కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు అజ్మత్ ఆధ్వర్యంలో ఎన్ ఎస్ యు ఐ జిల్లా ఎక్స్యూటివ్ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ ఇంచార్జి ఫేహద్ పిలుపు మేరకు నీట్ పరీక్ష లీక్‌పై నిరసన కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. సిద్దిపేట జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో, కళాశాలలో ఉన్న ఏమైనా సమస్యలు ఉంటే దగ్గరుండి పరిష్కరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్‌యుఐ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ ర్యాషాద్, జిల్లా ఉపాధ్యక్షుడు దావూద్, హుస్నాబాద్ నియోజకవర్గ అధ్యక్షుడు సనత్ రెడ్డి, గజ్వేల్ నియోజకవర్గ అధ్యక్షుడు కరుణాకర్, దుబ్బాక నియోజకవర్గ అధ్యక్షుడు వేణు, జిల్లా ప్రధాన కార్యదర్శి సలాహిద్దీన్, జిల్లా ప్రధాన కార్యదర్శి భాను, వివిధ మండలాల అధ్యక్షులు తదితరులు పాల్గొన్నారు.

గజ్వేల్ ప్రజలకు అందుబాటులో మల్టీస్పెషాలిటి హాస్పిటల్

నవతెలంగాణ-గజ్వేల్



గజ్వేల్ పట్టణ ప్రజలు పల్స్ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ సేవలను సద్వినియోగం చేసుకోవాలనిఉమ్మడి మెదక్ జిల్లా ఎమ్మెల్సీ డాక్టర్ యాదవ రెడ్డి తెలిపారు. ఆదివారం మల్టీ స్పెషాలిటి హాస్పిటల్‌ను పాప్రారంభించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. గజ్వేల్ ప్రజలు ఇలా అన్ని సౌకర్యాలు ఉండే మంచి వైద్య నిపుణులు కలిగిన హాస్పిటల్ సేవలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రజలకు మంచి వైద్యం అందించి ప్రజల మన్ననలు పొందాలని ఆయన వైద్యులకు సూచించారు. ప్రజలకు సేవ చేయడంలో డాక్టర్లు 24 గంటలు అందుబాటులో ఉండి పేద ప్రజలకు సేవలు అందించాలన్నారు. మున్సిపల్ చైర్మన్ రాజమౌళి మాట్లాడుతూ గజ్వేల్‌లో సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ పెట్టడం హర్షించదగ్గ విషయమన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ మాదాసు శ్రీనివాస్, జడ్పీటీసీ పంగ మల్లేశం, మున్సిపల్ వైస్ చైర్మన్ జక్కియోద్దీన్, స్థానిక కౌన్సిలర్ గుంటుకు రాజు, స్థానిక డాక్టర్లు డా, ఎలిశాల లింగం, డా. కొలిచెలిమి మహిపాల్, డా. మల్లయ్య హాస్పిటల్ యాజమాన్యం డాక్టర్ తుషార్, డాక్టర్ మహేష్, డాక్టర్ శ్రీనాథ్, డాక్టర్ నవీన్ రావు, డాక్టర్ అలీ, మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్ మోహన్ బాబు, శ్రావణ్, వెంకట్ గౌడ్ హాస్పిటల్ స్టాఫ్ తదితర సిబ్బంది, లోకల్ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

సీఈఐఆర్ టెక్నాలజీతో ఫోన్లు స్వాధీనం చేసుకున్న పోలీసులు

- బాధితులకు ఫోన్ల అప్పగించిన అడిషనల్ సీఐ ముత్యంరాజు

నవతెలంగాణ-గజ్వేల్ రూరల్

పోగొట్టుకున్న మొబైల్ ఫోన్స్ సీఈఐఆర్ టెక్నాలజీ సహాయంతో ఫోన్స్ స్వాధీనం చేసుకుని వాటిని తిరిగి బాధితులకు అప్పగించినట్లు గజ్వేల్ ముత్యంరాజు తెలిపారు. ఆదివారం భాదితులకు స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫోన్లను అప్పగించారు. ఈ సందర్భంగా గజ్వేల్ అడిషనల్ సీఐ ముత్యంరాజు మాట్లాడుతూ వేముల గట్టు గ్రామానికి చెందిన కొండల్ రెడ్డి గత కొన్ని రోజుల క్రితం బైక్‌పై వెళుతుండగా ఫోను ఎక్కడో పడిపోయిందని పేర్కొన్నారు. మరో వ్యక్తి గజ్వేల్ పట్టణానికి చెందిన నిరుడు తిరుపతి ఆరుబయట పడుకున్నప్పుడు ఫోన్ మర్చిపోయారని ఫిర్యాదులు వచ్చాయన్నారు. ఇరువురు ఫోన్లు పోయినాయని పోలీస్ స్టేషన్ రాగా కేంద్ర ప్రభుత్వం నూతనంగా తీసుకువచ్చిన అనే వెబ్‌సైట్‌లో ఫోన్ ఐఎంఈఐ నెంబర్‌ను ఎంటర్ చేసి, బ్లాక్ చేయడం జరిగిందన్నారు. ఫోన్ దొరికిన వ్యక్తి దానిలో సిమ్ కార్డు వేసుకోవడంతో, ఈ వెబ్‌సైట్ ద్వారా అతని వివరాలతో కూడిన సమాచారం రాగానే ఫోన్ దొరికిన వ్యక్తి నుంచి ఫోన్ స్వాధీనం చేసుకున్నామన్నారు. ఫోన్లు దొరికిన వెంటనే బాధితురాలకి ఫోన్ అందజేయడం జరిగిందన్నారు. ఎవరైతే ఫోన్ పోగొట్టుకుంటే, గుర్తుతెలియని వ్యక్తులు దొంగతనంగా ఎత్తుకొని పోయిన సమాచారం అందించాలన్నారు. వారు వెంటనే కేంద్ర ప్రభుత్వం నూతనంగా తీసుకువచ్చిన సెంట్రల్ ఎక్విప్మెంట్ ఐడెంటిటీ రిజిస్టర్ పోర్టల్ పూర్తి వివరాలు నమోదు చేసి పోగొట్టుకున్న ఫోన్‌ను నేరుగా బ్లాక్ చేయవచ్చన్నారు. అనంతరం కోల్పోయిన ఫోన్ తిరిగి పొందే అవకాశం ఎక్కువగా ఉంటుందని తెలిపారు. ఈ పోర్టల్‌ను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని, ఎవరన్నా సెకండ్ హ్యాండ్ ఫోన్స్ అమ్మితే కొనవద్దని సూచించారు.



చెలిమి ఫౌండేషన్ ఆధ్వర్యంలో చిన్నారికి చేయూత

- బహుళ అవయంతో చిన్నారి అవస్థ
- ఆసుపత్రి వైద్యం కోసం చెలిమి ఫౌండేషన్ ఆర్థిక సహాయం

నవతెలంగాణ-గజ్వేల్ రూరల్

బహుళ అవయంతో బాధపడుతున్న చిన్నారిని చెలిమి ఫౌండేషన్ సంస్థ సభ్యులు చేయూత ఇచ్చారు. ఈ సంఘటన ఆదివారం గజ్వేల్ మండలం గిరిపల్లి గ్రామంలో జరిగింది. ఈ సందర్భంగా ఫౌండేషన్ అధ్యక్షులు గుర్రం తులసీదాస్ మాట్లాడుతూ ఆపదలో ఉన్న వారిని ఆదుకోవడంలో చెలిమి ఫౌండేషన్ ముందుంటుందన్నారు. ఇందులో భాగంగా గిరిపల్లిలో 67వ ఆర్థిక సాయం అందించడం జరిగిందన్నారు. గిరిపల్లి గ్రామానికి చెందిన ఎనకమొల్ల స్వామి, కవిత దంపతుల కుమారుడు ప్రణీత్ బహుళ అవయవ వ్యాధితో బాధపడుతున్నాడని తెలుసుకున్నామన్నారు. వారు హైదరాబాద్‌లోని ఒక ప్రైవేట్ హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్నారని పేర్కొన్నారు. వీరికి ఎలాంటి ఆస్తులు లేకపోవడం, హాస్పిటల్ వైద్య ఖర్చులు చాలా అవుతున్నాయని తెలుసుకున్నామన్నారు. వారి పరిస్థితి ఫౌండేషన్ దృష్టికి రాగ వీరికి ఫౌండేషన్ తరపున రూ.15 వేలు నగదును అందచేయటం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ ఉపాధ్యక్షులు కొండాపురం యాదగిరి, కోశాధికారి దొంతుల ఆనంద్, సభ్యులు గుంటకు శ్రీనివాస్, పిట్ల ఆంజనేయులు, టెంట్ నర్సింలు, నాగపురి రమేష్, యాట ఆంజనేయులు, భువనగిరి రవీందర్, నందాల కృష్ణ, గుర్రం శ్రీకాంత్ చౌదరి, గ్రామస్థులు, తదితరులు పాల్గొన్నారు.

శాంతిభద్రతలకు విఘాతం కల్గిస్తే ఎంతటివారినైనా ఉపేక్షించేది లేదు

- స్వార్థం కోసం రాజకీయాలను వాడుకోవడం మానుకోవాలి
- ప్రభుత్వ, ప్రవేటు ఆస్తులను ధ్వంసం చేసి ప్రజలను భయాందోళనకు గురి చేయద్దు
- ప్రజలందరు సుఖశాంతులతో నల్లపోచమ్మ జాతర, బక్రీద్ పండుగను నిర్వహించుకోవాలి
- స్వార్థ రాజకీయాల్లో యువత జీవితాలను నాశనం చేసుకోవద్దు
- మెదక్ నియోజక వర్గ ఎమ్మెల్యే డా. మైనంపల్లి రోహిత్
- శాంతి భద్రతలపై డిజిపి, ఐజిలతో ఫోన్‌లో మాట్లాడిన ఎమ్మెల్యే

నవ తెలంగాణ-మెదక్ టౌన్



మతచిచ్చులతో కొందరు స్వార్థం కోసం రాజకీయాలను వాడుకుంటున్నారని, శాంతి భద్రతలకు విఘాతం కల్గిస్తే ఎంతటి వారినైనా ఊరుకునే ప్రసక్తే లేదని మెదక్ నియోజక వర్గ ఎమ్మెల్యే డా. మైనంపల్లి రోహిత్ హెచ్చరించారు. ఆదివారం ఎమ్మెల్యే డా. మైనంపల్లి రోహిత్ అధికారులతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మత సామరస్యాలకు ప్రతీకగా నిలిచిన మెదక్ ప్రాంతంలో మతచిచ్చులతో కొందరు వారి స్వార్థ ప్రయోజనాల కోసం మతచిచ్చులు రేకెత్తించి మెదక్ ప్రాంత ప్రజల్లో భయాందోళనకరమైన వాతావరణాన్ని సృష్టించారని ఆయన ఆరోపించారు. స్వార్థం కోసం రాజకీయాలను వాడుకోవడం సిగ్గుచేటన్నారు. అంతే కాకుండా శనివారం రాత్రి కొందరు అల్లరిమూకలు ప్రభుత్వ ఆస్తులను ధ్వంసం చేస్తూ వీరంగం సృష్టించడం ఎంత వరకు సమంజసం అని ఆయన ప్రశ్నించారు. ప్రభుత్వ ఆస్తుల ధ్వంసంకు కారకులైన వారిని ఉపేక్షించేది లేదని పోలీస్ శాఖకు సూచించారు. అంతే కాకుండా ఆదివారం జరుగుతున్న నల్లపోచమ్మ బండ్ల కార్యక్రమంతో పాటు సోమవారం జరిగే బక్రీద్ పండుగలను ప్రశాంతమైన వాతావరణంలో నిర్వహించుకోవాలని ప్రజలకు ఆయన విజ్ఞప్తి చేశారు. ఏలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు నిరంతరం గస్తీ నిర్వహించాలని ఆయన ఆదేశించారు.

పట్టణ ప్రజలు పోలీసులకు సహకరించాలి

శాంతిభద్రతల విషయంలో పోలీసులు 144 సెక్షన్ విధించిన నేపథ్యంలో పట్టణ ప్రజలు పోలీసు శాఖకు సహకరించాల్సిందిగా నియోజకవర్గ ఎమ్మెల్యే డా.మైనంపల్లి రోహిత్ కోరారు. పట్టణంలో ఎక్కడా హింసాత్మక ఘటనలు జరగకుండా ఉండేందుకు, ప్రజలకు ఏలాంటి ఇబ్బందులు కల్గకుండా ఉండేందుకు పోలీసులు కృషి చేస్తున్నారని ఆయన పేర్కోన్నారు.

భగ్గుమంటున్న కూరగాయల ధరలు

నవతెలంగాణ-సిద్దిపేట

రోజురోజుకూ పెరుగుతున్న కూరగాయల ధరలు సామాన్యుడి నడ్డి విరుస్తున్నాయి. ఏ కూరగాయలు కొనాలన్నా ధరలతో బెంబేలెత్తుతున్నారు. ప్రజలు గతంలో కిలోకు వెచ్చించిన ధరతో ఇప్పుడు కనీసం పావు కిలో రావడం లేదని వాపోతున్నారు. జిల్లాలో ప్రధానంగా సిద్దిపేట, దుబ్బాక, గజ్వేల్, హుస్నాబాద్, చేర్యాల మున్సిపాలిటీలతో పాటు జిల్లా వ్యాప్తంగా పలు మండలాల్లో కూరగాయల ధరలు భగ్గుమంటున్నాయి. మార్కెట్‌లోకి వెళ్లాలంటే పేద, మధ్య తరగతి ప్రజలు ధైర్యం చేయలేని పరిస్థితి ఏర్పడింది. ఐదు, ఆరు నెలల క్రితం కూరగాయల ధరలు అందుబాటులో ఉన్నా ఇప్పుడు ఆకాశాన్నంటుతున్నాయి. బెండకాయ, టమాట, పచ్చి మిర్చి, చిక్కుడు, వంకాయ, పాలకూర, దొండకాయ ఇలా ఒకటేమిటి పలు రకాల కూరగాయల ధరలు పెరిగాయి.

కొండెక్కిన ధరలు

జిల్లాలోని ప్రధాన మార్కెట్‌లో కూరగాయల ధరలు ఆకాశన్నంటుతున్నాయి. ప్రధానంగా టమాట ధర వింటే ధడ పుడుతోంది. కిలో టమాట రూ.80 పలుకుతోంది. చిక్కుడు రూ.60, వంకాయ రూ.34 బెండకాయ రూ.40, పచ్చిమిర్చి రూ.60, బీరకాయ రూ.74, క్యారెట్ రూ.44, దొండకాయ 34, ఉల్లిగడ్డ రూ.40, పాలకూర రూ.40, కొత్తిమీర రూ.20 పలుకుతోంది. వీటితో పాటు పలు రకాల కాయగూరలు, ఆకు కూరల ధరలు సైతం పెరిగాయి. గత వారం, పది రోజులుగా కూరగాయల ధరలు విపరీతంగా పెరగడంతో సామన్య ప్రజలు దిక్కుతోచని పరిస్థితిని ఎదుర్కొంటున్నారు.

తగ్గిన దిగుబడి

జిల్లాలో రైతులు సాగుచేస్తున్న కూరగాయలు ఎండలకు ఎండిపోవడం, నీరు లేకపోవడంతో దిగుబడులు తగ్గడంతో అవసరానికి సరిపోవడం లేదు. హైదరాబాదు నుంచి దిగుమతి చేస్తున్న కూరగాయలకు రవాణా చార్జీలు తోడవడంతో కూరగాయల ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయి.



దాడులకు పాల్పడ్డవారిని అరెస్టు చేయకుంటే బంద్ కొనసాగిస్తాం

- రాజాసింగ్ అరెస్టు ప్రభుత్వ పిరికిపంద చర్య
- అధికార పార్టీకి కొమ్ముకాస్తున్న పోలీసులు
- బీజేపీ అసెంబ్లీ నియోజకవర్గ ఇంచార్జి పంజా విజయ్ కుమార్

నవ తెలంగాణ-మెదక్ టౌన్



గోవుల తరలింపును అడ్డుకున్న బీజేపీ, అనుబంధ సంఘాల నేతలపై దాడులకు పాల్పడటాన్ని బీజేపీ తరపున తీవ్రంగా ఖండిస్తున్నామని, కత్తిపోట్లు పొడిచిన వారిని వెంటనే అరెస్టు చేయాలని బీజేపీ నియోజకవర్గ ఇంచార్జి పంజా విజయ్ కుమార్ డిమాండ్ చేశారు. ఆదివారం బీజేపీ మెదక్ అసెంబ్లీ నియోజకవర్గ కార్యాలయంలో ఆయన విలేకర్లతో మాట్లాడారు. మెదక్‌లో రెండు వర్గాల మధ్య జరిగిన ఘటనను తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు.

విషయం తెలుసుకోవడానికి మెదక్ పట్టణానికి విచేస్తున్న బీజేపీ ఎమ్మెల్యే రాజాసింగ్‌ను హైదరాబాద్‌లోనే అరెస్ట్ చేయడం రాష్ట్ర ప్రభుత్వ పిరికిపంద చర్య అని విమర్శించారు. మెదక్ ఎమ్మెల్యే మత ఘర్షణలు ప్రోత్సహిస్తున్నారని, హిందువులపై దాడులకు పాల్పడిన వారు ఎమ్మెల్యే అనుచరులేనని ఆరోపించారు. గోవులను తరలిస్తున్నారనే సమాచారంతో బీజేపీ అనుబంధ సంఘాల నేతలు అడ్డుకునే ప్రయత్నం చేశారే తప్ప ఎలాంటి దాడులకు పాల్పడలేదన్నారు. బీజేపీ అనుబంధ సంఘాల నేతలపై 50 మంది మూకుమ్మడిగా దాడికి యత్నించారని ఆరోపించారు. ఈ విషయాన్ని పోలీసులకు సమాచారం ఇస్తే స్పందించలేదన్నారు. ఘటనను అదుపు చేయడంలో పోలీసులు వైఫల్యం చెందారని ఆరోపించారు.

అధికార పార్టీకి కొమ్ము కాసే విధంగా పోలీసులు వ్యవహరిస్తున్నారన్నారు. గో వధ చేయొద్దని హైకోర్టు చెప్పినా అధికార ఒక వర్గానికి సహకారం అందిస్తున్నారన్నారు. విషయం తెలుసుకుని బీజేపీ జిల్లా అధ్యక్షులు గడ్డం శ్రీనివాస్, పట్టణ అధ్యక్షులు ప్రసాద్‌లు నిరసన తెలిపితే వారిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారని ఆరోపించారు. అరెస్ట్ చేసిన బీజేపీ నేతలను బేషరతుగా విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

మల్కాజిగిరి రౌడీయిజాన్ని ఎమ్మెల్యే మెదక్‌లో చేస్తున్నారని ఆరోపించారు. ఎమ్మెల్యే రోహిత్ దాడులను ప్రోత్సహిస్తున్నారన్నారు. దాడుల్లో గాయపడ్డ బీజేపీ శ్రేణులను అక్కున చేర్చుకుంటాం అని కేసులైన బీజేపీ శ్రేణులకు న్యాయపరంగా అండగా ఉంటామన్నారు. కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి, ఎంపీ లు రఘునందన్ రావ్, ఈటెల రాజేందర్‌లు పోలీస్ ఉన్నతాధికారులతో మాట్లాడారన్నారు. ఒక వర్గం వారం ఇచ్చిన ఫిర్యాదునే తీసుకుంటున్నారని ఆరోపించారు.

గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఉన్నప్పుడు ఎన్నో మతకల్లోలాలు జరిగాయని, నేడు నరేంద్రమోదీ నాయకత్వంలో భారత దేశం ఎలాంటి మత కల్లోలాలు లేవన్నారు. హిందువులనే టార్గెట్‌గా పోలీసులు వ్యవహరిస్తున్నారని విమర్శించారు. అనంతరం భజరంగ్ దళ్ రాష్ట్ర కన్వీనర్ శివరాం మాట్లాడుతూ గోవులను హత్య చేయొద్దని, హత్య చేసిన వారిని ముందస్తు అరెస్ట్ చేయాలని హైకోర్టు చెప్పిందన్నారు. మెదక్‌లో జరిగిన ఘటనను భజరంగ్ దళ్ తీవ్రంగా ఖండిస్తుందన్నారు.

పోలీస్ వ్యవస్థ పూర్తిగా విఫలమైంది

మెదక్‌లో బాద్యులను అరెస్ట్ చేయకుంటే సీఎం ఆఫీస్ ముట్టడిస్తామని హెచ్చరించారు. కత్తి పోట్లు జరిగితే సుమోటోగా కేసు నమోదు చేయాలి. కానీ పోలీసులు వన్ సైడ్ వ్యవహరించారని ఆరోపించారు. కత్తి పోట్లు పొడిచిన వారిని ఇంతవరకు అరెస్ట్ చేయలేదన్నారు. రాత్రి వరకు అరెస్ట్ చేయకుంటే బంద్ కొనసాగుతుందని స్పష్టం చేశారు.

ఈ సమావేశంలో మాజీ మున్సిపల్ చైర్మన్ చల్లా నరేందర్, విహెచ్పి సత్యనారాయణ, సత్యనారాయణ, ముక్క సుధాకర్,ఉదయ్ కుమార్,జక్కుల మల్లేశం పాల్గొన్నారు.

సంతోషిమాత ఆలయంలో కొనసాగుతున్న రజతోత్సవ వేడుకలు

- దేశపతి రాజశేఖర శర్మకు ఘనసన్మానం

నవతెలంగాణ-గజ్వేల్



గజ్వేల్‌లోని శ్రీ సంతోషిమాత ఆలయంలో రజతోత్సవ వేడుకలు కొనసాగుతున్నాయి. ఆదివారం ఆలయంలో ఇంటర్నేషనల్ వైశ్య ఫెడరేషన్ సిద్దిపేట జిల్లా అధ్యక్షులు ఎన్సీ సంతోష్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం పురోహితులు దేశపతి రాజశేఖర శర్మను శాలువాతో సత్కరించి మెమెంటో అందజేసి అభినందనలు తెలిపారు..ఈ సందర్భంగా ఎన్సీ సంతోష్ మాట్లాడుతూ ప్రజలను భక్తి మార్గం వైపు మల్లే విధంగా రాజశేఖర శర్మ చేస్తున్న కృషి అభినందనీయమని 25 సంవత్సరాల ఆలయ వార్షికోత్సవ వేడుక, ఆలయ పునరనిర్మాణ సంకల్ప కార్యక్రమం ఘనంగా నిర్వహిస్తున్నందుకుగాను రాజశేఖర శర్మకు చిరుసన్మానం చేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో ఇంటర్నేషనల్ వైశ్య ఫెడరేషన్ సిద్దిపేట జిల్లా అధ్యక్షులు నేతి శ్రీనివాస్, నాయకులు గుడాల రాధాకృష్ణ, తోట అమరేందర్ రావు, దుబ్బకుంట లక్ష్మణ్, ఉత్తునూరి సంపత్, తోడుపునూరి బాలేష్, విష్ణు తదితరులు పాల్గొన్నారు.

ముస్లిం సోదర సోదరీమణులకు బక్రీద్ శుభాకాంక్షలు

నవ తెలంగాణ- రాయపోల్



త్యాగానికి ప్రతీక అయిన బక్రీద్ పండుగ అల్లా దయతో ప్రజలందరూ సుభిక్షంగా ఉండాలని ఈద్- అల్- అదా (బక్రీద్) పండుగ సందర్భంగా ఎస్ ఆర్ ఫౌండేషన్ అధ్యక్షురాలు, సామాజిక ప్రజా సేవకురాలు మహమ్మద్ సుల్తాన ఉమర్ ముస్లిం సోదర సోదరీమణులకు శుభాకాంక్షలు తెలిపారు. త్యాగం, సహనం ఈ పండుగ ఇచ్చే మంచి సందేశాలన్నారు.దాన ధర్మాలకు ప్రతీక బక్రీద్ పండుగ అని అన్నారు. త్యాగం, సేవకు చిహ్నంగా బక్రీద్ పండుగ నిలుస్తుంది అన్నారు. దైవ ప్రవక్త ఇబ్రహీం మహెూన్నత త్యాగాన్ని స్మరించుకుంటూ ఈ పండుగ జరుపుకొంటారన్నారు. భక్తి భావం, విశ్వాసం, కరుణ, ఐక్యతకు సంకేతమైన ఈ పండుగను భక్తి శ్రద్ధలతో ఘనంగా జరుపుకోవాలన్నారు. ఈ పండుగ సోదర భావం, ఐక్యతకు ఆదర్శంగా నిలుస్తుందన్నారు. అల్లాహ్ ఆశీస్సులు ప్రజలందరికీ ఎల్లప్పుడూ ఉండాలని అభిలాషించారు. అల్లా దయతో ప్రజలందరూ సుబిక్షంగా ఉండాలని ప్రార్థిస్తున్నానన్నారు.

ఘనంగా ఫాదర్స్ డే

నవతెలంగాణ - నిజాంపేట



మండలంలోని గ్రామాలలో మండల కేంద్రంలో ఎంతోమంది యువకులు యువతులు తమ తల్లిదండ్రులను గౌరవిస్తూ కేకులను కట్ చేస్తూ హ్యాపీ ఫాదర్స్ డే ను ఘనంగా నిర్వహించారు. తమ పిల్లల బంగారు భవిష్యత్తుకు తండ్రులు ఎంతో కష్టపడతారని పిల్లల బాగోగులను వారి బాధ్యతలను తండ్రులే చూసుకుంటారు కాబట్టి వారికి ఘనంగా స్వీట్లు తినిపిస్తూ ఫాదర్స్‌డేను నిర్వహించారు.

బక్రీద్ శుభాకాంక్షలు తెలిపిన ప్రముఖులు

నవతెలంగాణ-జహీరాబాద్

త్యాగానికి ప్రతీకగా ఇస్లాం మతస్థులు జరుపుకునే పవిత్ర పండుగ బక్రీద్ (ఈద్ అల్-అధా) సందర్భంగా ముస్లిం సోదరులకు కాంగ్రెస్ నేత, మాజీ మంత్రి, కాంగ్రెస్ పార్టీ జహీరాబాద్ ఇన్‌చార్జి డాక్టర్ ఏ.చంద్రశేఖర్, ఫిలిం డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మెన్ గిరిధర్ రెడ్డి, పార్లమెంట్ నియోజకవర్గం ఇన్చార్జి డాక్టర్ ఉజ్వల్ రెడ్డి, టీఎస్ఐ డీసీ మాజీ చైర్మెన్ మహమ్మద్ తన్వీర్, ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మెన్ వై.నరోత్తంలు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. భక్తిని, త్యాగ గుణాన్ని బక్రీద్ పండుగ చాటి చెప్తుందన్నారు. జీవితంలో ఎదురయ్యే సమస్యలకు వెరవకుండా, దేవుని పై విశ్వాసాన్ని కలిగి, సన్మార్గంలో జీవనాన్ని సాగించాలనే గొప్ప సందేశాన్ని బక్రీద్ పండుగ మానవాళికి ఇస్తుందన్నారు. తమకు కలిగిన దాంట్లో నుంచే ఇతరులకు పంచిపెట్టడానికి మించిన దాతృత్వం మరొకటి లేదనే స్ఫూర్తిని ఈ పండుగ కలిగిస్తుందన్నారు. కాబట్టి ముస్లిం సోదరులు ప్రశాంత వాతావరణంలో భక్తి శ్రద్ధలతో పండుగ నిర్వహించుకోవాలన్నారు. ప్రజలందరిపై అల్లా ఆశీస్సులు ఎల్లవేళలా ఉండాలని ఆకాంక్షించారు.

కాంగ్రెస్‌లో చేరిన బీఆర్ఎస్ నేతలు

నవతెలంగాణ-జిన్నారం



జిన్నారం మండల పరిధిలోని బీఆర్ఎస్ పార్టీకి చెందిన సోలక్‌పల్లి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం చైర్మెన్ గోపాల్ రెడ్డి బృందం ఆదివారం బీఆర్ఎస్ తీర్థం పుచ్చుకున్నారు. జిన్నారం ఎంపీపీ దమ్మ గౌని రవీందర్ గౌడ్, బ్లాక్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు దాసరి శ్రీకాంత రెడ్డి, వడ్డే కృష్ణ, జిన్నారం ఎంపీపీ ఉపాధ్యక్షులు గంగు రమేష్‌ల సారథ్యంలో నాయకులు నలగండ్ల గోపాల్ రెడ్డి, ప్రభాకర్ గౌడ్‌లను ఆహ్వానించి పటాన్చెరు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ కాటా శ్రీనివాస్ గౌడ్ వారికి కాంగ్రెస్ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో సోలక్‌పల్లి నాయకులు గోపాల్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, జంగారెడ్డి, సాజిద్ బృందం పాల్గొన్నారు.



బక్రీద్ పండుగ ప్రశాంతంగా జరిగేలా చర్యలు

నవతెలంగాణ-హవేలీఘనపూర్

బక్రీద్ పండుగ ప్రశాంతంగా జరిగేలా చర్యలు తీసుకోవాలని మెదక్ జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ అన్నారు. నేడు బక్రీద్ పండుగ నేపథ్యంలో ఆదివారం జిల్లా కలెక్టరేట్లో జిల్లా ఎస్పీ బాలస్వామి, అడిషనల్ ఎస్పీ మహేందర్‌తో కలసి రెవెన్యూ, పశు సంవర్ధక, మున్సిపల్, పంచాయతీ, ట్రాన్స్‌పోర్ట్, పోలీస్ అధికారులతో సమన్వయ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, మెదక్ జిల్లా చాలా ప్రశాంతవంతమైన ప్రాంతమని.. మత సామరస్యానికి చిహ్నం అన్నారు. ప్రతీ పండుగను కుల మతాల అతీతంగా జరుపుకుంటారనీ, అదే సంస్కృతిని కొనసాగించి ప్రజలందరు శాంతిభద్రతలను కాపాడటానికి సహకరించాలని కోరారు. జిల్లా ఎస్పీ బాలస్వామి మాట్లాడుతూ.. జిల్లాలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చర్యలు తీసుకుంటామని తెలిపారు. అన్ని వర్గాల ప్రజలు సహకారం అందించాలని కోరారు. ఈ సమావేశంలో జిల్లా పశు సంవర్ధక అధికారి డాక్టర్ విజయ శేఖర్ రెడ్డి, జిల్లా రవాణా శాఖ అధికారి వెంకటస్వామి, మున్సిపల్ కమిషనర్ జానకి రామ్, తహసీల్దార్ మహేందర్ గౌడ్, పోలీస్, పంచాయతీ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

బక్రీద్ పండుగ శుభాకాంక్షలు తెలిపిన ఎమ్మెల్యే



నవతెలంగాణ-సంగారెడ్డి

సంగారెడ్డి జిల్లా ముస్లిం సోదరులకు సంగారెడ్డి ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ బక్రీద్ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. త్యాగం, సహనం బక్రీద్ పండుగ ఇచ్చే సందేశమన్నారు. భక్తి భావానికి, విశ్వాసానికి, కరుణ, ఐక్యతకు సంకేతమైన ఈ పండుగను భక్తి శ్రద్ధలతో ఘనంగా జరుపుకోవాలని ఆయన ఆకాంక్షించారు. అల్లా ఆశీస్సులు ప్రజలందరికీ ఎల్లప్పుడూ ఉండాలని అభిలషించారు.

జిన్నారంలో నేడు ఉచిత వైద్య శిబిరం

నవతెలంగాణ-జిన్నారం

మండల కేంద్రమైన జిన్నారంలో నేడు(సోమవారం) ఉచిత వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు గ్రామస్తులు తెలిపారు. జగద్గిరిగుట్ట పద్మజ హాస్పటల్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిభిరం స్థానిక గ్రామపంచాయతీ వద్ద నిర్వహించినున్నట్లు చెప్పారు. ఈ శిబిరంలో ఎముకల,నరాల,చిన్న పిల్లల స్త్రీల సంబంధిత, వివిధ సాధారణ సాధారణ వైద్య సంబంధిత అంశాలకు సంబంధించిన వైద్య బృందం పాల్గొని ఉచిత వైద్య వైద్యాన్ని అందిస్తారన్నారు. కాబట్టి ఈ శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.



గోవధ చట్టాన్ని సంపూర్ణంగా అమలు చేయాలి

నవతెలంగాణ-న్యాల్‌కల్

గోవులను వధించొద్దని హైకోర్టు ఆదేశాల మేరకు.. గోవధ చట్టాన్ని సంపూర్ణంగా అమలు చేసే విధంగా చర్యలు తీసుకోవాలని బీజేపీ మండల నాయకులు హద్నూర్ పోలీస్ స్టేషన్‌లో ఎస్ఐ రామునాయుడుకు బుధవారం వినతి పత్ర ం అందజేశారు. బక్రీద్ పండుగకు గోవులను వధించకుండా చర్యలు తీసుకోవాలని వినతిపత్రంలో పేర్కొన్నారు. కాగా ఎక్కడైనా గోవధలు గమనిస్తే సమాచారం ఇవ్వాలని పోలీసులు సూచించారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో బీజేపీ మండలాధ్యక్షులు ఓంకార్, మల్లేష్, సంతోష్ పాటిల్, వాసు, ఓనం రెడ్డి, వీరన్న, ఉప్పరి మల్లేష్ తదితరులు ఉన్నారు.



గుమ్మడిదల : గోవధ చట్టాన్ని అమలు చేయాలని బీజేపీ మండలాధ్యక్షుడు పలువు గోవర్ధన్ రెడ్డి అన్నారు. ఈ మేరకు ఎస్ఐ మహేశ్వర్ రెడ్డికి గోవధ నిర్మూలన చట్టం అమలు చేయాలని వినతి పత్రం అందజేశారు. బక్రీద్ పండుగను పురస్కరించుకొని గోవులను కోసుకొని తినే సాంప్రదాయాన్ని వెంటనే నిలిపి వేసే విధంగా రాష్ట్ర ప్రభుత్వం గోవధ చట్టాన్ని అమలు చేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో బీజేపీ స్టేట్ కౌన్సిల్ సభ్యులు గిద్దె రాజు, జిల్లా ఓబీసీ కార్యదర్శి చెన్నంశెట్టి ఉదయ్ కుమార్, అంజిరెడ్డి, కావలి ఐలేష్, రాఘ వరెడ్డి, భాస్కర్ గౌడ్, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



కోహిర్ : గోవధ చట్టాన్ని సంపూర్ణంగా అమలు చేయాలని కోరుతూ బీజేపీ మండలాధ్యక్షులు వైద్యనాథ్ ఆధ్వర్యంలో స్థానిక సబ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ పోలీస్‌కి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వైద్యనాథ్ మాట్లాడు తూ..హైకోర్టు ఆదేశాల మేరకు గోవద చట్టాన్ని సంపూర్ణంగా అమలు చేసే విధంగా చర్యలు తీసుకోవాలని కోరిన ట్లు చెప్పారు. నేడు బక్రీద్ పండుగను పురస్కరించుకుని హిందు వులు ఆరాధ్య దైవంగా కొలిచే గోమాతను (ఎద్దును కూడా) కుర్బానీ పేరుతో వధిస్తారని.. ఆ విధంగా జరగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. మండలంలోని ప్రతీ గ్రామ ంలో బీజేపీ కార్యకర్తలు గోవధను గమనిస్తూ జరిగే అఘాయిత్యా న్ని పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. ఈ రాష్ట్ర ఓబిసి మోర్చా కార్యవర్గ సభ్యులు కిష్టన్న, సోషల్ మీడియా అసెంబ్లీ కన్వీనర్ సతీష్, మండల ప్రధాన కార్యదర్శి నర్సింలు, ఉపా ధ్యక్షులు రమేష్, నరేష్, కార్యదర్శి జే.విజేందర్, కోశాధికారి చంద్రశేఖర్,టౌన్‌అధ్యక్షులుసంతోష్‌తదితరులు పాల్గొన్నారు.

స్కానింగ్ సెంటర్లు.. భద్రమేనా



- కాసులకు కక్కుర్తి పడి విచ్చలవిడిగా అనుమతులిస్తున్న అధికారులు
- చాలా సెంటర్లలో అసిస్టెంట్లతోనే స్కానింగ్
- నిబంధనలు గాలికొదిలేస్తున్న నిర్వాహకులు
- ప్రజల ప్రాణాలతో చెలగాటం

నవతెలంగాణ-జహీరాబాద్

మానవ జీవితంలో వైద్యరంగం ఎంత ప్రాముఖ్యమైనదో అందరికీ తెలిసిందే. డాక్టర్లను కనిపించే దేవుళ్లుగా ప్రజలు భావిస్తుంటారు. ఎలాంటి అనారోగ్య సమస్య వచ్చినా.. వైద్యులే దిక్కు. దీన్ని అదునుగా భావించిన కొందరు వైద్యులు సర్ది, తుమ్మినా, దగ్గినా స్కానింగ్ తీసుకురావాలనేది పరిపాటిగా చెబుతున్నారు. రోడ్డు ప్రమాదం జరిగిందంటే చాలు అది పెద్ద ప్రమాదమా, చిన్న ప్రమాదమా అని సంబంధం లేకుండా.. సి.టి స్కానింగ్ తీసుకురావాలని చెబుతు న్నారు. అంతేకాకుండా ఫలానా స్కానింగ్ సెంటర్‌కు వెళ్లాలని వాళ్లే రిఫర్ చేస్తున్నారు. స్కానింగ్ సెంటర్ల నిర్వాహకులు.. మండల కేంద్రాల్లో ఉన్న వైద్యులతో సహా, జిల్లా కేంద్రంలో ఉన్న నర్సింగ్ హోమ్‌ల నిర్వాహకులతో సత్సంబంధాలు ఏర్పాటు చేసుకొని స్కానింగ్‌లతో దందా చేస్తున్నారు. ఈ తతంగం జిల్లా కేంద్రం నుంచి మొదలుకొని మారుమూల ప్రాంతాలైన మండల, గ్రామస్థాయి వైద్యుల వరకు సాగుతుందంటే.. వ్యాపారం ఎలా నడుస్తుందో అర్థం చేసుకోవచ్చు.

జిల్లాలో 27 స్కానింగ్ సెంటర్లు మాత్రమే ఉన్నాయి

ప్రభుత్వ నిబంధనల ప్రకారం జిల్లాలో 27 స్కానింగ్ సెంటర్లు ఉన్నాయి. వీటికి అనుమతులు ఇచ్చే ముందు ప్రభుత్వ నిబంధనల ప్రకారం అన్నింటిని పరిశీలించాకే అనుమతులు ఇచ్చాం. స్కానింగ్ సెంటర్ల వద్ద రోగులకు నీటి సౌకర్యం, టాయిలెట్స్, వెయిటింగ్ హాల్ లాంటి సౌకర్యాలు కూడా కల్పించాలి. స్కానింగ్ మిషన్లకు స్థాన చలనం ఉండదు. స్థానచలనం చేస్తే తప్పకుండా జిల్లా అధికారుల అనుమతులు తీసుకోవాలి. అలా కాకుండా నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకుంటాం.

- గాయత్రి దేవీ, డీఎంఅండ్‌హెచ్‌ఓ

ప్రభుత్వ నిబంధనల ప్రకారం జిల్లాలో కేవలం 27 స్కానింగ్ సెంటర్లు మాత్రమే ఉన్నాయని అధికారులిచ్చిన సమాచారం. కానీ అడ్డదారుల్లో, అనుమతుల్లేకుండా పట్టణాల్లో గల్లీకో స్కానింగ్ సెంటర్‌లు వెలిశాయి. వాటిల్లో చాలా వరకు నిబంధనలు పాటించడం లేదు. స్కానింగ్ చేసే వారు ఎంబిబిఎస్ పూర్తి చేసి రేడియాలజిస్ట్ అయి తర్వాత ప్రత్యేక శిక్షణ పొందిన వారు మాత్రమే స్కానింగ్ నిర్వహించాలి. కానీ చాలా స్కానింగ్ సెంటర్లలో పేరుకు మాత్రమే వైద్యులు ఉంటారు. అక్కడున్న సిబ్బందితోనే స్కానింగ్‌లు తీపిస్తున్నారు. ఆ ఫోటోను వైద్యునికి పంపిస్తే.. ఆయన పంపిన సందేశాన్ని రోగులకు చెబుతున్నారు. వాస్తవానికి స్కానింగ్ సెంటర్లను నిర్వహించాలంటే ప్రత్యేక గదులు ఏర్పాటు చేసుకోవాల్సి ఉంటుంది. సెంటర్‌ను జిల్లా వైద్య శాఖ అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించిన తర్వాతే స్కానింగ్ నిర్వహణకు అనుమతులు ఇస్తారు. కానీ పలువురు వైద్యులు తమ కార్లలో స్కానింగ్ మిషన్లను తీసుకొని వచ్చి రోగులకు స్కానింగ్ నిర్వహిస్తూ మొబైల్ స్కానింగ్‌లను చేపడుతున్నారని ఆరోపణలు ఉన్నాయి. ఈ మొబైల్ స్కానింగ్‌లు రోగుల ప్రైవసీని ఏ మేరకు కాపాడుతాయని వారి కుటుంబ సభ్యులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గతంలో చాలాసార్లు దాడులు చేసి.. అనుమతులు లేని సెంటర్లను సీజ్ చేసిన దాఖలాలు కూడా ఉన్నాయి. ఆ తదుపరి అధికారులు మళ్లీ అలాంటి వాటిపై దృష్టి సారించకపోవడంతో ఈ దందా మూడు పువ్వులు ఆరు కాయలుగా కొనసాగుతున్నది.

ఫలానా స్కానింగ్ సెంటర్‌లనే తీసుకురావాలి..

జిల్లాలోని ఒక్కొక్క నర్సింగ్ హోమ్‌కు, కార్పొరేట్ వైద్యశాలలకు సంబంధించిన స్కానింగ్ సెంటర్లు ప్రత్యేకంగా ఉన్నాయి. ఆ వైద్యశాలలోని వైద్యులు వారు సూచించిన స్కానింగ్ సెంటర్లకు వెళ్తే మాత్రమే చికిత్సలు అందిస్తారు. అలాంటి వైద్యశాలల్లో తలనొప్పితో వెళ్లిన చాలు సిటీ స్కానింగ్ చేయించుకోవాలని స్కానింగ్ సెంటర్లకు రెఫర్ చేస్తున్నారన్న ఆరోపణలూ ఉన్నాయి. స్కానింగ్ సెంటర్ నిర్వాహకులు తమ వద్దకు రోగులను పంపిస్తే.. రోగులకు పంపించిన శాతాన్ని బట్టి సదరు వైద్యులకు నెలనెలా ముడుపులు ముట్ట చెబుతున్నారన్న ఆరోపణలు కూడా చాలా వినిపిస్తున్నాయి.

గర్భిణీ స్త్రీలకు స్కానింగ్ తప్పనిసరేనా..

గర్భం దాల్చిన నుంచి ప్రసవం వరకు గర్భిణీ స్త్రీలకు వైద్యులు రకరకాల స్కానింగ్లు రాస్తూ చికిత్సలు నిర్వహిస్తున్నట్లు తెలుస్తోంది. పెద్ద నర్సింగ్ హోమ్‌లో ఆసుపత్రుల్లోనే స్కానింగ్ చేస్తుండగా.. చిన్నచిన్న వైద్యులు, క్లినిక్‌లు పెట్టుకున్న వైద్యులు మాత్రం స్కానింగ్ సెంటర్లకే రిఫర్ చేస్తున్నారు. అయితే అలాంటి పలు స్కానింగ్ సెంటర్లలో కనీసం జాగ్రత్తలు కూడా తీసుకోవడం లేదని గర్భిణులు ఆరోపిస్తున్నారు. పురుష వైద్యులు స్కానింగ్ నిర్వహిస్తున్నప్పుడు కనీసం సిస్టర్‌లను కూడా వెంబడి పెట్టుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కిశోర బాలికలకు రుతుక్రమంలో వస్తున్న మార్పుల కారణంగా వారి శరీర భాగాల్లో మార్పులు వస్తున్నప్పటికీ.. అలాంటి వారిని సైతం స్కానింగ్‌కు డాక్టర్లు రెఫర్ చేస్తున్నారని పలువురు మండిపడుతు న్నారు. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు స్పందించి రక్షణ లేని.. నిబంధనలు పాటించని స్కానింగ్ సెంటర్‌లపై చర్య లు తీసుకోవాలని రోగులు వారి బంధువులు విజ్ఞప్తి చేస్తున్నారు.

నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలి

కనీస వేతనం రూ.26,000 అమలు చేయాలి.. సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షులు చుక్క రాములు



నవతెలంగాణ-సంగారెడ్డి

నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని, కనీస వేతనం రూ.26,000 వెంటనే అమలు చేయాలిని సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షులు చుక్క రాములు అన్నారు. క్రౌన్ బీర్ పరిశ్రమ కార్మికుల జనరల్ సమావేశం సంగారెడ్డిలోని కేవల్ కిషన్ భవన్‌లో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా చుక్క రాములు మాట్లాడుతూ.. కేంద్రంలోని బీజేపీ నరేంద్ర మోడీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి పదేండ్లు దాటినా.. ఏ రోజూ కార్మికుల కోసం కష్టజీవుల కోసం ఆలోచించడం లేదన్నారు. నిరంతరం పెట్టుబడిదారుల జపం చేస్తున్నదని ఆరోపించారు. కార్మికులు పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాలను, హక్కులను హరిస్తూ నాలుగు లేబర్ కోడ్ తెచ్చిందని.. వాటిని వెంటనే ఉపసంహరించుకొని కార్మికులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. 8 గంటల పనిని 12 గంటలు పెంచేందుకు చట్టం చేస్తున్నారన్నారు. పెరుగుతున్న ధరలకనుగుణంగా కనీస వేతనం రూ. 26000 ఇవ్వాలని కోరాం. మోడీ కార్మిక వర్గ విధానాలకు వ్యతిరేకంగా కార్మిక వర్గం ఐక్యంగా పోరాడాలని పిలుపునిచ్చారు. ఈ సమా వేశంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షులుమల్లేష్ ఉపాధ్యక్షులు బాగ రెడ్డి, నాయకులు రమేష్, శ్రీధర్,అలీ, భాయ్ పాల్గొన్నారు.

ప్రపంచ మానవాళికి ఎర్రజెండా దిక్సూచి



నవతెలంగాణ-సంగారెడ్డి

ప్రపంచ మానవాళికి ఎర్రజెండా దిక్సూచిగా నిలచిందని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి గొల్లపల్లి జయరాజు అనాన్నరు. సంగారెడ్డి కేకే భవన్‌లో పార్టీ మండల స్థాయి రాజకీయ శిక్షణా తరగతులను ఆదివారం ప్రారంభించి మాట్లాడారు. ప్రపంచంలో దోపిడీ, పీడన, వివక్ష, అణచివేత ఉన్నంత కాలం కమ్యూనిజం అజేయంగా నిలుస్తుంద న్నారు. దేశ భవిష్యత్తు మార్చేది సోషలిజమేనని, అదే అంతిమ పరిష్కారమన్నారు. పాలకులు అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై గర్జించేది కమ్యూనిస్టులేనన్నారు. ఇటీవల జరిగిన పార్లమెంట్ ఎన్నికల్లో కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం అనేక హామీలు ఇచ్చి మూడోసారి అధికారంలోకి వచ్చిందన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం అనుసరించిన ప్రజా వ్యతిరేక విధానాలకు ప్రజలు గుణపాఠం చెప్పారన్నారు. మరోపక్క కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి ఐదు నెలలు నడుస్తున్నా. ఇచ్చిన ఆరు హామీల్లో కేవలం రెండు హామీలు మాత్రమే అమలు చేసిందని విమర్శించారు. కమ్యూనిస్టు ఉద్యమ చరిత్ర అనే క్లాసును సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు మాణిక్ బోధించారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా కమిటీ సభ్యులు నర్సింలు కొండాపూర్ మండలం కార్యదర్శి రాజయ్య కంది మండలం కార్యదర్శి శ్రీనివాస్ నాయకులు బాబూరావు, రత్నయ్య, శేఖర్, సుజాత, నర్సింలు, ప్రభాకర్, సంజీవ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా నవాయతన రామ శిలాయాత్ర మహోత్సవం



నవతెలంగాణ-సంగారెడ్డి

శ్రీ జ్యోతిర్వాస్తు విద్యాపీఠం పసల్వాది వ్యవస్థాపకులు డాక్టర్ శ్రీ మహేశ్వర శర్మ సిద్ధాంతి ఆధ్వర్యంలో ఆదివారం అంగరంగ వైభవంగా నవాయతన రామశిలాయాత్ర మహోత్సవం నిర్వహించారు. పోతిరెడ్డిపల్లి చౌరస్తా వద్దగల సంగమేశ్వర ఆలయం నుంచి పసల్వాది విద్యాపీఠ వరకు ఈ యాత్ర సాగింది. అత్యంత క్రమశిక్షణతో అతి సుందరంగా 13 కోట్ల రామ నామాల్ని పలుకుతూ మహాయాత్రలో భక్తులు పాల్గొన్నారు. అత్యంత అరుదైన 18 అడుగుల పొడవు 7 అడుగుల వెడల్పు పది అడుగుల ఎత్తు గల భారీ శిలను పూలతో అలంకరించి భారీ వాహనంలో తరలించారు. పరివార రామ స్వరూపమైన శిలను భక్తి ప్రపత్తులతో వేదస్వర నాదస్వర వార్కరి భజన మేలవింపుతో వేల మహిళా భక్తులు శిలాభిషేక ద్రవ్యాల కళాశాలను శిరస్సుపై ధరించి సాంప్రదాయ నృత్య గీత వాద్య తాళ నాద పురస్సర ప్రదర్శనలతో అభినయంతో వేషధారణలతో వివిధ గ్రామాల భజన ద్వారా 13 కోట్ల రామ నామాన్ని పలుకుతూ అత్యంత వైభవంగా రామశీల శోభాయాత్ర నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విద్యాపీఠ సభ్యులు ట్రైబల్ వెల్ఫేర్ సెక్రెటరీ శరత్ దంపతులు, తోపాజి అనంత కిషన్, ప్రశాంత్ కుమార్, సాహితి రాము, వెంకన్న, విట్టల్ దాస్, కారం సంజయ్, వెంకట్ రెడ్డి, కారం విలాస్, నరేష్, భారీ ఎత్తున భక్తులు పాల్గొన్నారు.



వైభవోపేతంగా నగర సంకీర్తన



నవతెలంగాణ-జహీరాబాద్

జహీరాబాద్ పట్టణంలోని ఎన్‌జీఓ కాలనీలో 107వ నగర సంకీర్తన ఆదివారం అత్యంత వైభవోపేతంగా జరిగింది. హరే కృష్ణ నామం జపిస్తూ భక్తులు కాలనీ వీధుల గుండా నృత్యాలు చేస్తూ భజనలు చేశారు. పట్టణంలో గత 107 వారాలుగా నిరాటంకంగా సాగుతున్న ఈ కార్యక్రమానికి అనూహ్య స్పందన లభిస్తోంది. చిన్నారులు, మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

23న రాధా గోవింద రథయాత్ర..

జహీరాబాద్ పట్టణంలో అప్రతిహతంగా కొనసాగుతున్న నగర సంకీర్తనలో భాగంగా 108వ సంకీర్తన ఘనంగా నిర్వహించడానికి ఈనెల 23న రాధా గోవింద రథయాత్ర కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు హరే కృష్ణ ఫౌండేషన్ బాధ్యులు డాక్టర్ వినోద్ ప్రభు తెలిపారు. సాయంత్రం 4:30 గంటలకు స్థానిక శివాజీ విగ్రహం నుంచి రథయాత్ర ప్రారంభమై శెట్కర్ ఫంక్షన్ హాల్ వద్ద ముగుస్తుందన్నారు. హరేకృష్ణ భక్తులు, ప్రజలు పాల్గొనాలని పిలుపునిచ్చారు. పత్ర పుష్ప ఫలాలతో రాధా గోవింద రథయాత్ర కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. ఇదే క్రమంలో రాధా గోవింద రథయాత్ర ను దృష్టి లో ఉంచుకొని ఈనెల 23వ తేదీ వరకు పట్టణ పరిధిలోని వివిధ ప్రాంతాల్లో ప్రతి రోజు ఉదయం నగర సంకీర్తన నిర్వహించనున్నట్లు, తద్వారా రాధా గోవింద రథయాత్ర విజయంతం చేయడానికి అవసరమైన చర్యలు తీసుకోనున్నట్టు తెలిపారు.ఈ కార్యమంలో సంగారెడ్డి జిల్లా అక్షయ పాత్ర సీఈఓ విభీషణ ప్రభు,రతన్ సరడ, నరసింహారెడ్డి, రఘు, రమేష్, కనుకుంట్ల నర్సింలు, జానకిరామ్, వశిష్ఠ, చైత్ర తదితరులు పాల్గొన్నారు.

కాజిపల్లి కాలుష్యంపై పోరాటం

నవతెలంగాణ-జిన్నారం

కాజిపల్లి కాలుష్యంపై నిరంతర పోరాటం కొనసాగిస్తామని.. ప్రజారోగ్యాన్ని పర్యావరణాన్నీ దారుణంగా దెబ్బతీస్తున్న శక్తులు జాగ్రత్తా అంటూ జేఏసీ నాయకులు దండే రమాకాంత్, కాజిపల్లి ఎంపీటీసీ ఆకుల భార్గవ బృందం ఆదివారం మూకుమ్మడి హెచ్చరిక చేసింది. వాగు వంకలు, అడవి వన్నెలు, పంట పొలాలతో పచ్చంగా విలసిల్లే కాజీపల్లిని.. పరిశ్రమలు తీవ్రంగా దెబ్బతీస్తాయని గుర్తు చేస్తూ ఆదివారం ఓ ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. విచ్చలవిడి కాలుష్యంతో వాగులు వంకలు కాలుష్యంగా మారాయన్నారు. వ్యవసాయం కొరబడిందని పంట పొలాలు కాలుష్యపు కాసారాలుగా దర్శనమిస్తున్నాయని మండిపడ్డారు. పరిశ్రమల యాజమాన్యం కాసుల కోసం కాలుష్యాన్ని వెదజల్లుతున్నారని ఆరోపించారు. పక్షం రోజుల్లో కాజిపల్లి గ్రామం కాలుష్య రహిత దిశగా పరిశ్రమల వర్గాల నుంచి చర్యలు ఉండాలన్నారు. అప్పట్లో మెదక్ జిల్లా పరిషత్ చైర్మెన్‌గా పనిచేసిన దండే రామకృష్ణ, అప్పటి గ్రామ సర్పంచ్ గొల్ల రాములు ఆధ్వర్యంలో కాలుష్య నివారణ, వ్యవసాయ రైతులకు నష్టపరిహారం, కాజిపల్లి గ్రామానికి వివిధ రకాల సౌకర్యాల కల్పన జరిగిందంటూ గుర్తు చేశారు. పరిశ్రమలు వరాలు, కొందరు స్వార్థపరులు కాసుల వేటలో భాగంగా పచ్చని కాజీపల్లిని పంట పొలాల కాజీపల్లిని సర్వ నాశనం చేశారంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. విచ్ సెలబ్రిటీ కాలుష్యం ప్రజారోగ్యానికి హాని కలిగించే కాలుష్యం.. పంట పొలాలను వాగులను వంకలను విధ్వంసం చేస్తున్న కాలుష్యంపై పోరాటం ఆగదని హెచ్చరించారు. కాజిపల్లి గ్రామాన్ని కాలుష్యం నుంచి విముక్తి చేసేందుకు పరిశ్రమలు ప్రత్యామ్నాయ దారులు ఆలోచించాలన్నారు. యువకులు, గ్రామస్తులు సమగ్రమైన కార్యాచరణతో కాలుష్య నివారణ పోరాటం ఉధృతం చేస్తామని జేఏసీ నేతలు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, యువకులు పాల్గొన్నారు.



వైభవంగా సువర్చల హనుమాన్ కళ్యాణోత్సవం



నవతెలంగాణ-సిద్దిపేట

వీర హనుమాన్ దేవాలయంలో ఆదివారం సువర్చల హనుమత్ కల్యాణోత్సవం వైభవంగా జరిగింది. ఉదయం ఆంజనేయ స్వామికి మహాభిషేకం, మన్యుసూక్తంలచే హెూమం జరిగింది. అనంతరం హనుమాన్ సువర్చలమూర్తులను పట్టణంలో (శావా) ఊరేగించారు. మధ్యాహ్నం ఆలయం ముందు బ్రహ్మశ్రీ అరవపల్లి రఘురామ శర్మ, మరింగంటి శ్రీకరాచార్యులు, రాం బహదూర్ ద్వివేదిల ఆధ్వర్యంలో మేళ తాళాలు, మంత్రోచ్చారణ మధ్య వివాహ వేడుక కన్నుల పండుగగా జరిగింది. అమ్మవారికి మహిళలు ఓడి బియ్యం పోశారు. ఈ సందర్భంగా అన్నదానం నిర్వహించారు. ఈ వేడుకలో వివిధ ప్రాంతాల నుంచి భక్తులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

హన్మంత రావుకు శుభాకాంక్షలు తెలిపిన గంప మహేందర్ రావు



నవతెలంగాణ-సిద్దిపేట

మాజీ పీసీసీ అధ్యక్షులు, మాజీ రాజ్యసభ సభ్యులు వి. హన్మంత రావు పుట్టిన రోజు సందర్భంగా టీపీసీసీ సెక్రటరీ గంప మహేందర్ రావు శాలువా కప్పి, బొకే అందజేసి పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హనుమంతరావు కాంగ్రెస్ పార్టీకి వెన్నెముక అని అన్నారు. సిద్దిపేటతో ఆయనకు సత్సంబంధాలు ఉన్నాయన్నారు. ఆయన నిండు నూరేళ్ల జీవించాలని దేవున్ని వేడుకుంటున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

బక్రీద్ పండుగ శుభాకాంక్షలు తెలిపిన మాజీ మంత్రి

- ఎమ్మెల్యే హరీశ్ రావు



నవతెలంగాణ-సిద్దిపేట

ఈద్-అల్-అదా(బక్రీద్) పండుగ సందర్భంగా మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్ రావు ముస్లింలకు శుభాకాంక్షలు తెలిపారు. త్యాగం, సహనం ఈ పండుగ ఇచ్చే మంచి సందేశాలన్నారు. దానధర్మాలకు ప్రతీక బక్రీద్ పండుగ అని అన్నారు. త్యాగం, సేవకు చిహ్నంగా బక్రీద్ పండుగ నిలుస్తుందిన్నారు. దైవ ప్రవక్త ఇబ్రహీం మహెూన్నత త్యాగాన్ని స్మరించుకుంటూ ఈ పండుగ జరుపుకొంటారన్నారు. అల్లా దయతో తెలంగాణ రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని ప్రార్థిస్తున్నానన్నారు.

మాజీ సీఎం కేసీఆర్‌ను కలిసిన మాదాడి వినయ్ రెడ్డి



నవతెలంగాణ-గజ్వేల్

మాజీ సీఎం, గజ్వేల్ ఎమ్మెల్యే కేసీఆర్‌ను ఆయన వ్యవసాయ క్షేత్రంలో ఆదివారం మదాడి వినయ్ రెడ్డి మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వినయ్ రెడ్డి మాట్లాడుతూ కేసీఆర్‌ను కలిసి యోగ క్షేమాలు తెలుసుకోవడం జరిగిందన్నారు. తనను కేసీఆర్ ఆప్యాయంగా పలకరించారని సంతోషం వ్యక్తం చేశారు.

18న నాయి బ్రాహ్మణుల జిల్లా సంఘం ఎన్నికలు



నవతెలంగాణ-సిద్దిపేట

నాయిబ్రాహ్మణ సంఘం సిద్దిపేట జిల్లా ఎన్నికలు ఈ నెల 18వ తేదిన నిర్వహిస్తున్నట్లు జిల్లా నిర్మాణ కమిటీ సభ్యులు సింగరాల కనకయ్య, జాలిగామా విద్యాకర్, కొండూరి సతీష్, సింగిరాల శ్రీనివాస్‌లు తెలిపారు. నాయి బ్రాహ్మణ సేవా సంఘంను పునర్నిర్మాణం కోసం ఎలక్షన్ నిర్వహించనున్నట్లు తెలిపారు. జిల్లాలోని 25 మండలాలతో పాటుగా, పట్టణ నాయి బ్రాహ్మణ సంఘాల నాయకులు కలిసి రావాలని కోరారు. 18న ఉదయం 9 గంటలకు జిల్లా కేంద్రంలోని ప్రెస్ క్లబ్‌లో ఎన్నికలు జరగనున్నాయని తెలిపారు. ఈ సంఘ నిర్మాణం ఏ ఒక్కరి వ్యక్తిగత ప్రయోజనాల కోసం కాకుండా, జిల్లాలో ఉన్న పట్టణ, గ్రామీణ నాయి బ్రాహ్మణ కుటుంబం వరకు ప్రతిఫలాలను అందించే విధంగా ఈ నిర్మాణ కమిటీ కృషి చేస్తుందని తెలిపారు.

మృతుని కుటుంబానికి ఆర్థిక సాయం



నవతెలంగాణ-మర్కుక్

మండలంలోని పాములపర్తి గ్రామానికి చెందిన మునిగడప ఆంజనేయులు ఇటీవల ప్రమాదవశాత్తు చెరువులో పడి మృతిచెందాడు. ఆదివారం మర్కుక్ ఎంపీపీ తాండ పాండు గౌడ్ మృతుని కుటుంబాన్ని పరామర్శించి, ఆర్థిక సహాయం అందజేశారు, ఆయన వెంట కర్రోల్ల నర్సింలు, బాలకృష్ణ, రఘుపతి, పోచయ్య మహేష్, అనిల్, స్వామి, పోచయ్య, తదితరులున్నారు.

బాధితునికి ఎల్‌ఓసి అందజేత



నవతెలంగాణ-మద్దూరు

మండలంలోని సలాక్ పూర్, గ్రామానికి చెందిన ఎర్ర మల్లేశం, గుండెకు సంబంధించిన వ్యాధితో బాధపడుతూ ఉండడంతో అతనికి ప్రభుత్వం నుంచి రూ.1,60,000 ఎల్వోసి మంజూరు చేయించి బాధితునికి కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు నాగపురి కిరణ్ కుమార్ గౌడ్ ఆదివారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గుండె వ్యాధితో బాధపడుతున్న ఎర్ర మల్లేశం సమస్యను దేవాదాయ శాఖ మంత్రి కొండ సురేఖ దృష్టికి తీసుకెళ్లడంతో ఆమె సానుకూలంగా స్పందించి ప్రభుత్వం నుంచి రూ.1,60,000 ఎల్ఓసి మంజూరు చేసినట్లు ఆయన తెలిపారు. ఎల్ఓసి అందించి ఒక ప్రాణానికి అండగా నిలిచిన మంత్రి కొండా సురేఖకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

ఘనంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనాలు



నవతెలంగాణ-మద్దూరు

మద్దూరు మండల కేంద్రంలోని జడ్పీహెచ్ఎస్ పాఠశాలలో 2011-12 సంవత్సరంలో 10వ తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థులు, దూల్మిట్ట మండల కేంద్రంలోని జడ్పీహెచ్ఎస్ పాఠశాలలో 2003-04 సంవత్సరంలో పదవ తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థులు ఆదివారం పూర్వ విద్యార్థుల సమ్మేళనాలను ఘనంగా నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా తమకు విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులను శాలువా, మెమొంటలతో ఘనంగా సన్మానించారు. అనంతరం పూర్వ విద్యార్థులు తమ చిన్ననాటి జ్ఞాపకాలను ఒకరినొకరు పంచుకున్నారు. ఈ కార్యక్రమంలో పూర్వ ఉపాధ్యాయులు, పూర్వ విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు

కేసీఆర్‌పై బురదల్లే ప్రయత్నం మానుకోవాలి

- ఆరు గ్యారంటీలు అమలు చేయాలి
- ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాపరెడ్డి

నవతెలంగాణ-గజ్వేల్

రైతు ప్రజా సంక్షేమం కోసం చత్తీస్‌గడ్ నుంచి విద్యుత్ కొనుగోలు విషయంలో మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌పై సీఎం రేవంత్ రెడ్డి కుట్రలు, కుతంత్రాలతో బురదజల్లే ప్రయత్నం చేస్తున్నారని ఎఫ్డిసి మాజీ చైర్మన్ వంటేరు ప్రతాపరెడ్డి అన్నారు. ఆదివారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ 70 సంవత్సరాలు పరిపాలించిన కాంగ్రెస్ హయాంలో విద్యుత్ కోతలు, పంటలు ఎండి పోవడంతో రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారని ఆయన గుర్తు చేశారు. 2014లో తెలంగాణ రాష్ట్రం ఆవిర్భావం తర్వాత రాష్ట్రంలో రైతులకు ప్రజలకు 24 గంటల కరెంటు ఇవ్వడంతో పంటలు పండించుకున్న రైతులు ఆర్థికంగా సామాజికంగా బలోపేతమైనట్టు ఆయన గుర్తు చేశారు. పది సంవత్సరాలుగా కేసీఆర్ అందించిన నిరంతర విద్యుత్ అందించిన కేసీఆర్‌పై నర్సింహారెడ్డి కమిటీ వేయడం ఎంత వరకు సమంజసం ఉన్నారు. 70 సంవత్సరాలు చీకట్లో ఉన్న తెలంగాణ రాష్ట్రాన్ని వెలుగులు నింపిన కేసీఆర్ పై రేవంత్ రెడ్డి నిందలు వేస్తున్నారని ఆయన విమర్శించారు. ప్రస్తుతం విద్యుత్తు గ్రామాల్లో ఏ స్థాయిలో సరఫరా అవుతుందో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలుసుకోవాలని ఆయన అన్నారు. జస్టిస్ నరసింహారెడ్డి కంపెనీ తక్షణమే వెనుకకు తీసుకోవాలని, లేనిపక్షంలో పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని ఆయన హెచ్చరించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన 420 హామీలు ఆరు గ్యారంటీల అడ్రస్ లేదని మొదటగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వాటిపై దృష్టి పెట్టాలన్నారు. రాజకీయ లబ్ది కోసం కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం పాకులాడుతుందన్నారు. ఆరు నెలల్లోనే రేవంత్ రెడ్డి ప్రభుత్వం రూ.40 వేల కోట్లు అప్పు చేసిందన్నారు. 40 వేల కోట్లు డబ్బులు ఏ అభివృద్ధి కార్యక్రమాలు గురించి ఉపయోగించాలో చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. ఫోన్ టాపింగ్, కాళేశ్వరం పేరుతో ఆరు మాసాలలో కాంగ్రెస్ కాలం గడిపిందన్నారు. ఇప్పుడు విద్యుత్ కమిషన్ పేరిట కేసీఆర్ ప్రతిష్టలు దెబ్బతీసేందుకు కుట్రలు జరుగుతున్నాయన్నారు. కనీసం దివ్యాంగులకు పెన్షన్ ఇవ్వలేదని ఆయన విమర్శించారు. రైతు రుణమాఫీ రైతుబంధు, రైతు పెట్టుబడి, రైతు భరోసా, మహిళలకు ఇచ్చే రూ. 2500 అడ్రస్ లేదన్నారు. మల్లన్న సాగర్, కొండపోచమ్మ సాగర్ ఉమ్మడి ఉన్న కెనాన్ పనులను తొందరగా పూర్తి చేసి రైతులకు సకాలంలో సాగునీరు అందించాలని డిమాండ్ చేశారు. గజ్వేల్‌లో మల్లన్న సాగర్ ఆర్ అండ్ ఆర్ కాలింగ్‌లో 95% పనులను గత కేసీఆర్ ప్రభుత్వం పూర్తి చేసిందని మిగతా పనులను పూర్తి చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ విలేకరుల



సమావేశంలో బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు మాదాసు శ్రీనివాస్, గజ్వేల్ జెడ్పిటిసి పంగ మల్లేశం, వర్గల్ జెడ్పిటిసి బాలమల్లు, గజ్వేల్ మండల పార్టీ అధ్యక్షులు బెండ మధు, కౌన్సిలర్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

సామాజిక విలువలను ఉపాధ్యాయులు కాపాడాలి

- ప్రొఫెసర్ కాశీం

నవతెలంగాణ-గజ్వేల్

సమాజంలో అంతరించిపోతున్న సామాజికములను ఉపాధ్యాయులు కాపాడు వలసిన సమయం వచ్చిందని ఉస్మానియా యూనివర్సిటీ తెలుగు శాఖ ఉపాధ్యక్షులు ప్రొఫెసర్ సి ఖాసిం అన్నారు. ఆదివారం స్థానిక మహతి ఆడిటోరియంలో ఏర్పాటు చేసిన టిపిటిఎఫ్ ఏర్పాటు చేసిన సదస్సుకు హాజరై మాట్లాడుతూ సామాజిక విలువలు పూర్తిగా సంక్షోభంలో చిక్కుకున్నాయని ఆయన ఆవేదన చెందారు. దేశ ప్రధానులు సైతం సన్యాసులను, బాబాలను ప్రోత్సహిస్తూ సామాజిక విలువలను తగ్గిస్తున్నారన్నారు. ప్రధానమంత్రి, కేంద్ర మంత్రులు, రాష్ట్ర ముఖ్యమంత్రులు బాధ్యతలు చేపట్టినప్పుడు బాబాలు, సన్యాసుల సమక్షంలో బాధ్యతలు తీసుకోవడం అంటే సామాజిక విలువలను సమాధి చేస్తున్నట్టుందని ఆయన ఆవేదన చెందారు. ఉపాధ్యాయులు సంక్షేమం, విద్యారంగా అభివృద్ధితోపాటు సామాజిక సమస్యల పరిష్కారం కోసం కృషి చేయాలని ఆయన కోరారు. సామాజిక విలువలకు ఒక వ్యక్తిగా నిలబడ్డ ప్రకాష్ రావు ఉద్యోగ విరమణ చేయడం ఆయనకు మరింత బాధ్యత పెరిగిందని ఆయన అన్నారు. గజ్వేల్ మండలం అక్కారం గ్రామానికి చెందిన ప్రకాష్ రావు ఉద్యమాల నేపథ్యం వచ్చిన ఉపాధ్యాయుడు అన్నారు. అనంతరం ఏపీటీఎఫ్ పూర్వ రాష్ట్ర అధ్యక్షుడు నర్సింహారెడ్డి మాట్లాడుతూ బాధ్యతలు, హక్కుల కోసం పోరాడే ఏకైక ఉపాధ్యాయ టిపిటిఎఫ్ అని ఆయన పేర్కొన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు నాణ్యమైన శాస్త్రీయమైన విద్యను అందించాలని ఆయన కోరారు. దేశం, రాష్ట్రంలో ప్రపంచవ్యాప్తంగా సామాజిక రాజకీయ ఆర్థిక సంస్కృతి రంగాల్లో జరుగుతున్న పరిమాణాలను వస్తున్న మార్పులను ఉపాధ్యాయులు లోతుగా అవగాహన పెంచుకోవాలని ఆయన సూచించారు. పాఠశాల నుంచి పరిశోధన స్థాయి వరకు ప్రభుత్వ విద్యాసంస్థలు కొట్టుమిట్టాడుతున్న దుస్థితి ఉందన్నారు. పాలకవర్గాల నిర్ణయాలు మూలంగా ప్రైవేట్ విద్యాసంస్థలు విద్యను వ్యాపారవేత్తంగా మార్చాయని విద్యను కొనుగోలు సరుకుగా మార్చుతున్నట్టు ఆయన ఆవేదన చెందారు. ప్రజలు కోరుకునే కామన్ స్కూల్ శాస్త్రీయ విద్యను అమలు చేసే బాధ్యత ప్రభుత్వాలపై ఉందన్నారు. అనంతరం అరుణోదయ సంస్కృతి సమైక్య విమలక్క మాట్లాడుతూ ప్రభుత్వాలు విద్యారంగా ప్రయోజనాల కోసం తామంతుడు తాముగా పనిచేయడం ఎప్పుడో ఆగిపోయిందన్నారు. అధికార ప్రభుత్వం హామీలను నినాదాక మాట్లాడిన మాటలు వారికి గుర్తు చేయవలసిన పరిస్థితి సమాజంలో ఏర్పడిందన్నారు. ఆట పాట మాట ద్వారా సామాజిక విలువలను తెలుపుతున్నామన్నారు. అనేక ఉద్యమాల్లో టిపిటిఎఫ్ నిలబడిందన్నారు. మలి దశ తెలంగాణ ఉద్యమంలో కీలకపాత్ర పోషించిందన్నారు. ఈ కార్యక్రమంలో టిపిటిఎఫ్ ఉపాధ్యాయ సంఘం నాయకులు రామచంద్రం, పాపిరెడ్డి, సురేందర్, నరసయ్య, శంకర్, విద్యాసాగర్, శేషాచారి, అశోక్ కుమార్, నాగిరెడ్డి, భాస్కర్ రెడ్డి, కనకయ్య తిరుపతిరెడ్డి,



రాములు, విజయేందర్ రెడ్డి, మల్లికార్జున్, రాజులు, రాజయ్య, పాపిరెడ్డి, నరసయ్య, విద్యాధర రెడ్డి, నాగరాజు, రాములు, సత్తయ్య, యూసుఫ్, కనకరాజు, అనంతరం సంస్కృతి కార్యక్రమాలు అక్కారం సత్తయ్య బృందంతో నిర్వహించారు

రక్తదానం చేయడంలో రాజగోపాల్ పేట యువకుల సాహసం

- రక్త దానంతో ప్రాణాలు నిలుపుతున్న రాజగోపాల్ పేట యువకులు



నవతెలంగాణ-సంగునూరు

అన్ని విపత్కర పరిస్థితిలో మనిషి జీవన మనుగడ కొనసాగాలంటే రక్తం అవసరం. అలాంటి రక్తం కావలసిన సందర్భంలో మేమున్నామంటూ నంగునూరు మండలం రాజగోపాలపేట గ్రామానికి చెందిన యువకులు పిడికిలి బిగించి ముందుంటున్నారు. ఇంతింతై వటుడింతై అన్నట్టు ఒకరు ధైర్యం చేసి ముందుకు రావడంతో మొదలైన ఈ






రక్తదాన సాహసం ఆ గ్రామంలో నేడు 50 మందికి చేరింది. ఎవరికి ఆపద వచ్చిందని తెలిసినా రక్తం కావాలంటే మొక్కిన దేవుడు వస్తాడో లేదో తెలీదుకానీ రాజగోపాల్ పేట గ్రామ యువకులు ఆస్పత్రులకు చేరుకోవడంలో వెనుకాడడం లేదు. పేద, ధనిక, బంధుప్రీతి సంబంధాలను ఆలోచించకుండా ఎక్కడ ఎవరికి రక్తం అవసరం ఉందని తెలిస్తే చాలు ముందుంటున్నారు. రాజగోపాలపేట గ్రామ యువకులు చేస్తున్న రక్తదానం గురించి తెలుసుకున్న చుట్టుపక్కల గ్రామాల ప్రజలు, నాయకులు, అధికారులు, మాజీ ప్రజాప్రతినిధులు వారిని అభినందిస్తున్నారు. గత కొన్ని రోజులుగా మాజీ మంత్రి హరీశ్ రావు జన్మదిన, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ జన్మదినమైనా, ఎలాంటి పండుగ వాతావరణంలోనైనా రక్తదాన శిబిరం ఏర్పాటు చేయాలంటే వైద్యులు రాజగోపాలపేట వెళ్లాల్సిందే అంటున్నారు. ఒక్కొక్కరు సుమారు 20 నుంచి 30 సార్లకు పైగా రక్తదానాన్ని చేసిన యువకులు ఈ గ్రామంలో ఉండడం గమనార్హం. ఇలాంటి యువకులను చూసి మరింత మంది ముందుకు వస్తే ఇంకొంత మంది ప్రాణాలను దక్కించుకోవచ్చని అంటున్నారు. ఏదేమైనా రాజగోపాలపేట గ్రామ యువకులు చేస్తున్న రక్తదానాన్ని వారి సహసాన్ని చూసి విన్నవారు అబ్బుర పోవాల్సిందే అంటున్నారు. రాజగోపాలపేట యువకులను చూసి అన్ని గ్రామాలలో ఇలాంటి యువకులు మరింత మంది ప్రాణాలను కాపాడేందుకు రక్తదానం చేయడానికి ముందుకు రావాలని కోరారు.

బక్రీద్ ఖుర్బాని బీదలపాలిట మహాదానం

- రుస్తుం అంతర్జాతీయ చిత్రకారులు



నవతెలంగాణ-సిద్దిపేట

బక్రీద్ పండుగను పురస్కరించుకుని రుస్తుం ఆర్ట్ గ్యాలరీలో ఆదివారం "బక్రీద్ ఖుర్బాని ముబారక్" క్యాన్వాస్ చిత్రాన్ని అంతర్జాతీయ చిత్రకారులు రుస్తుం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పండుగలు సమాజంలో నిస్తేజాన్ని తొలగించి, జీవితాలను కళావంతం చేస్తాయని అన్నారు. బక్రీద్ ఈదుల్ జుహ పర్వదినం త్యాగానికి, సహనానికి ప్రతీక అనీ, పండుగ నాడు ధనవంతులు తమకు కల్గిన సంపదలో బీదలకు రెండున్నర శాతం వస్తురూపేన పంచి అల్లా కృపకు పాత్రులు కావాలని అల్ ఖురాన్ భోదిస్తుందన్నారు. పండుగ నాడైన బీదవాడు కడుపునిండా తినాలని ఇచ్చే "మహాదానం ఖుర్బాని" అంతర్భావ ముఖ్య ఉద్దేశమన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ఎ ఎఫ్ అధ్యక్షురాలు జులేఖరుస్తుం, నైరూప్య చిత్రకారుడు నహీంరుస్తుం, అసిస్టెంట్ ప్రొఫెసర్ రుబినారుస్తుం, మహ్మద్ రహీమ్, తదితరులు పాల్గొన్నారు

అవాలతో తండ్రి కొడుకుల చిత్రాలు అపురూపం





నవతెలంగాణ-గజ్వేల్

పితృ దినోత్సవం సందర్భంగా తండ్రి కొడుకుల చిత్రాలను అవాలతో అపురూపంగా చిత్రించి ఆదివారం నాడు రామకోటి కార్యాలయంలో ఆవిష్కరించి తన తండ్రికి అంకితం ఇచ్చారు శ్రీరామకోటి భక్త సమాజం వ్యవస్థాపక, అధ్యక్షులు, రాష్ట్రస్థాయి కళారత్న అవార్డు గ్రహీత రామకోటి రామరాజు . ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాను ఆధ్యాత్మికంగా ఉన్నత శిఖరాలకు ఎదగడానికి తండ్రే కారణమన్నారు. ఈ సృష్టికి పరిచయం చేసిన మా నాన్నకు పాదాభివందనం చేస్తూ, నాలో ఉన్న కళకు పదును పెట్టి చిత్రాన్ని రూపొందించానన్నారు. కనిపించే దేవతలు తల్లిదండ్రులే అన్నారు.

బీమా నగదు అందజేత



నవతెలంగాణ-బెజ్జంకి

మండల కేంద్రంలోని శ్రీ లక్ష్మీనరసింహ స్వామి పురుషుల పొదుపు సంఘ సభ్యుడు బండిపెల్లి శ్రీనివాస్ ఇటీవల ఆనారోగ్య కారణాలతో మృతి చెందాడు. పొదుపు సంఘ కార్యవర్గ సభ్యులు మృతుని నామినీ కుటుంబ సభ్యులకు సుమారు రూ.67,869 బీమా నగదును ఆదివారం అందజేశారు. సమితి అధ్యక్షుడు పన్యాల విష్ణువర్ధన్ రెడ్డి, సంఘ అధ్యక్షుడు సంగ రవి, ఉపాధ్యక్షుడు వాసిమల్ల రమేష్, పాలకవర్గ సభ్యులు వడ్లూరీ సాయిలు, దుమాల మహేశ్, తాడిచెట్టు భూమయ్య, బొనగం నర్సయ్య, బోనగిరి లింగయ్య, వడ్లూరీ శ్రీనివాస్, వడ్లూరీ మల్లేశం, గణకుడు రవీందర్ పాల్గొన్నారు.

కల్యాణ లక్ష్మి, చెక్కుల అందజేత



నవతెలంగాణ-బెజ్జంకి

మండల పరిధిలోని అయా గ్రామాల లబ్ధిదారులకు ఆదివారం ప్రజా భవన్ యందు సుమారు రూ.85 లక్షల కల్యాణ లక్ష్మి చెక్కులనూ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ అధికారులతో కలిసి అందజేశారు. తహసిల్దార్ శ్రీనివాస్ రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఒగ్గు దామోదర్, మండలాధ్యక్షుడు ముక్కీస రత్నాకర్ రెడ్డి, యూత్ రాష్ట్ర నాయకులు పులి కృష్ణ, మండల నాయకులు పాల్గొన్నారు.

రఘునందన్ రావును విమర్శించే అర్హత బీఆర్ఎస్ నాయకులకు లేదు

- బీజేపీ సిద్దిపేట పట్టణ అధ్యక్షుడు కోడూరి నరేష్



నవతెలంగాణ-సిద్దిపేట

మెదక్ ఎంపీ రఘునందన్ రావును విమర్శించే అర్హత బీఆర్ఎస్ నాయకులకు లేదని బీజేపీ సిద్దిపేట పట్టణ అధ్యక్షుడు కోడూరి నరేష్ అన్నారు. ఆదివారం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రఘునందన్ రావు ప్రజా ఆశీర్వాదంతో గెలిచాడని అన్నారు. పార్టీలకు అతీతంగా ఓట్లు వేసిన ప్రతి ఒక్కరికి ఎంపీ కృతజ్ఞతలు తెలిపితే, అది అర్థం కాని కొందరు బీఆర్ఎస్ నాయకులు గుమ్మడికాయ దొంగ అంటే భుజాలు తరుముకున్నట్లు రఘునందన్ రావును విమర్శించడం సిగ్గుచేటన్నారు. బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో బీజేపీ కార్యకర్తలపై అక్రమ కేసులు బనాయించినా భయపట్ట లేదన్నారు. బీజేపీ కార్యకర్తలను బీఆర్ఎస్ నాయకుడు కొండం సంపత్ రెడ్డి తక్కువ చేసి మాట్లాడడం సరికాదన్నారు. ప్రజాస్వామ్యంలో ఓటు అనే ఆయుధంతో బీఆర్ఎస్‌కు ప్రజలు బుద్ధి చెప్పి, బీజేపీని గెలిపించారన్నారు. అయోధ్యలో హిందువుల చిరకాల స్వప్నమైన రామాలయాన్ని నిర్మించింది కాబట్టి, బీజేపీకి రాముని పేరు మీద ఓట్లు అడిగే హక్కు ఉందని స్పష్టం చేశారు. మెదక్ పార్లమెంట్ పరిధిలో ఆరు సిట్టింగ్ ఎమ్మెల్యేలు ఉండి కూడా మూడో స్థానానికి దిగజారిపోయిన బీఆర్ఎస్ బీజేపీని విమర్శించడం సిగ్గుచేటున్నారు. ఎంపీ రఘునందన్ రావుపైన చౌకబారు విమర్శలు చేస్తే ఊరుకునేది లేదని హెచ్చరించారు. ఈ సమావేశంలో జిల్లా మాజీ ఉపాధ్యక్షుడు తొడుపునూరి వెంకటేశం, ప్రధాన కార్యదర్శి దాబా నరేష్, పట్టణ ఉపాధ్యక్షులు పుల్లయ్యగారి వెంకట్ గౌడ్, పట్టణ కార్యదర్శి రాగరం శ్రీను, గరిపల్లీ సాయి బాబా, పట్టణ బీజేవైఎం నాయకులు కాసనగట్టు సాయి కృష్ణ పాల్గొన్నారు.

హనుమాన్ ఆలయ అభివృద్ధికి రూ.50116 విరాళం



నవతెలంగాణ-హుస్నాబాద్ రూరల్

హుస్నాబాద్ మండలంలోని పందిల్ల గ్రామానికి చెందిన అలుమల్ల సవిత కిషన్ రెడ్డి గ్రామంలోని శ్రీ హనుమాన్ దేవాలయం అభివృద్ధి కోసం రూ.50,116 లను ఆదివారం గ్రామ మాజీ సర్పంచ్ తోడేటి రమేష్ కు అందజేశారు. గ్రామ అభివృద్ధి కోసం కృషి చేస్తున్న ప్రతి ఒక్కరి కృతజ్ఞతలు తెలిపారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



నవతెలంగాణ-రాయపోల్

జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల దౌల్తాబాద్ 1986-1987 బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థులు ఆదివారం దౌల్తాబాద్ మండల కేంద్రంలో పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులు మాట్లాడుతూ మేము దౌల్తాబాద్ మండల కేంద్రంలో పదవ తరగతి పూర్తయిన తర్వాత మళ్లీ 37 సంవత్సరాల తరువాత ఈ విధంగా కలుసుకోవడం చాలా ఆనందంగా ఉందన్నారు. తాము ఈ రోజు ఇంత గొప్ప స్థాయికి రావడానికి తమ గురువులే కారణమని తల్లి, తండ్రి తరువాత ఎవరైనా గురువులను గౌరవించాలన్నారు. త్రిమూర్తులు అంటే తల్లి, తండ్రి, గురువు అన్నారు. మేము గురుదక్షిణ కింద వారికి ఏమిచ్చినా కాని వారి రుణం తీర్చుకోలేమని తెలిపారు. ప్రతి వ్యక్తి తన జీవితంలో కత్తిపోటు తప్పిన గాని కలంపోటు తప్పదన్నారు. ఒక చిన్న అటెండర్ స్థాయి నుంచి ఐఏఎస్ దేశ అత్యున్నత పదవి అయిన ప్రధాని, రాష్ట్రపతి వరకు ఎవరైనా పాఠశాలకు వెళ్లకుండా గురువుల చేత విద్య బుద్ధులు అభ్యసించకుండా సాధించలేమన్నారు. ఉపాధ్యాయ వృత్తి చాలా పవిత్రమైనదని అలాంటి గొప్ప ఉపాధ్యాయులు తమకు దొరకడం ఎంతో అదృష్టమన్నారు. తమకు తల్లిదండ్రులు జన్మనిచ్చి ఈ ప్రపంచానికి పరిచయం చేస్తే మేము ఇంత గొప్ప స్థాయికి ఎదగడానికి తమ గురువులే కారణమన్నారు. జీవితాంతం తమ గురువులకు రుణపడి ఉంటామని వారిని ఎల్లవేళలా గుర్తించుకుంటామని తెలియజేశారు. అలాగే గురువులు మాట్లాడుతూ చాలా సంవత్సరాల తర్వాత మళ్లీ విద్యార్థులందరినీ కలుసుకోవడం చాలా సంతోషకరన్నారు. ఉపాధ్యాయులకు విద్యార్థులు తమ కంటే ఉన్నత స్థాయికి ఎదిగితే దానికి మించిన గురుదక్షిణ లేదన్నారు. విద్యార్థులదరూ గొప్ప స్థాయికి ఎదిగి సుఖసంతోషాలతో జీవించాలని కోరుకున్నారు. అనంతరం వారికి విద్యాబుద్ధులు చెప్పిన ఉపాధ్యాయులకు ఘనంగా సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో ప్రధాన ఉపాధ్యాయులు బీ. రంగారెడ్డి, ఉపాధ్యాయులు లింగమూర్తి, నరసింహ చారి, విట్టల్, దేవేందర్ రెడ్డి, విద్యార్థులు ఏ. శ్రీనివాస్, బి మల్లేశం, ఎం వీరేశం, కిషన్, ఎస్ జ్యోతి, జి పద్మ, రమేష్ గౌడ్, బి. శ్రీదేవి, ఎన్. రామయ్య బాలచారి, బి.వీరేశం, సిహెచ్. శ్రీనివాస్, కే.మల్లేశం, టీ. బాలయ్య, వెంకటరామిరెడ్డి, ఎన్. అరుణ, విజయలక్ష్మి, నరసింహారెడ్డి, కే. రాజిరెడ్డి, సిహెచ్. అంజయ్య సిహెచ్.కమల, సిహెచ్. విమల, ఏ. మల్లేశం, ఏ. పాపయ్య, వెంకట్ గౌడ్, లింగం గౌడ్, జి. శ్రీనివాస్ రెడ్డి, జె. హరిబాబు, చంద్రమౌళి గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామ పంచాయితీ సిబ్బంది పెండింగ్ వేతనాలను ప్రభుత్వం వెంటనే చెల్లించాలి

18న మండల కేంద్రాలు, 20న ఎమ్మెల్యేల ఇండ్ల దగ్గర, ధర్నాలు



24వ తేదీన కలెక్టరేట్ ముట్టడులను జయప్రదం చేయండి: సిఐటీయు పిలుపు

నవ తెలంగాణ మెదక్ టౌన్

గ్రామాలలో పారిశుద్ధ్యం పనిచేసే గ్రామ పంచాయతీ సిబ్బందికి గత 8 నెలల బకాయి వేతనాలను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే చెల్లించాలని సీ ఐ టీ యూ జిల్లా కోశాధికారి నర్సమ్మ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం మెదక్ కేంద్రంలో జరిగిన గ్రామపంచాయతీ యూనియన్ జిల్లా కమిటీ సమావేశంలో ఆమె మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత గత ఎనిమిది నెలలుగా వేతనాలు చెల్లించకుండా బకాయిలు ఉన్నాయని ఆమె మండిపడ్డారు. గ్రామాలలో ప్రజలందరికీ అందుబాటులో ఉండి మంచినీళ్ల, కరెంటు, పరిశుభ్రత వంటి సేవలు అందిస్తున్న గ్రామపంచాయతీ సిబ్బంది వేతనాలను చెల్లించకుండా పంచాయతీ సిబ్బంది పట్ల ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించడం మంచి పద్ధతి కాదని ఆమె మండిపడ్డారు. 8 నెలలుగా వేతనాలు చెల్లించకపోతే కార్మికులు ఏమి తిని సేవలు ప్రజలకు అందిస్తారు అని ప్రభుత్వమే తెలియజేయాలని ఆమె మండిపడ్డారు. అప్పులు చేసి కొందరు, పస్తులతో కొందరు కుటుంబాలను కొనసాగిస్తున్నారని ఆమె అవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం వెంటనే వేతనాలు చెల్లించకపోతే గ్రామపంచాయతీ యూనియన్ గా రాష్ట్ర కమిటీ కార్యాచరణ నిర్ణయించిందని ఆమె అన్నారు. ఈ నెల 18వ తేదీన మండల కేంద్రాలలో 20వ తేదీన ఎమ్మెల్యేల ఇళ్ల దగ్గర 24వ తేదీన కలెక్టర్ కార్యాలయాల ముట్టడి కార్యక్రమాలు ఉంటాయని ఆమె తెలియజేశారు. దశలవారీగా జరిగే తేదీలలో ధర్నాలలో జిల్లాలోని అన్ని మండలాల కార్మికులు సిబ్బంది అన్ని గ్రామాల నుండి పెద్ద ఎత్తున ధర్నా కార్యక్రమాల్లో పాల్గొనాలని మన పెండింగ్ వేతనాలు ఇతర సమస్యలపై జరిగే ఈ పోరాటంలో ప్రతి ఒక్కరు పాల్గొనాలని అందరికీ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో గ్రామపంచాయతీ జిల్లా నాయకత్వం పాల్గొన్నారు .

బిజేవైఎం నాయకుడు అరుణ్ ను పరామర్శించిన మైనంపల్లి

నవ తెలంగాణ మెదక్ టౌన్



శనివారం రాత్రి మెదక్ పట్టణంలో కొందరు అల్లరుమూఖలు సృష్టించిన దాడిలో తీవ్రంగా గాయపడ్డ బిజేవైఎం నాయకులు అరుణ్ ను తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు మైనంపల్లి హన్మంతరావు, మెదక్ నియోజక వర్గ ఎమ్మెల్యే డా. మైనంపల్లి రోహిత్ హైద్రాబాద్ లోని మియాపూర్ పద్మావతి ఆసుపత్రికి వెళ్ళి పరామర్శించారు. అరుణ్ రాజ్ ఆరోగ్యపరంగా పూర్తి బాధ్యతలు తీసుకుంటామని వారు హామినిచ్చారు.

వైభవంగా మహంకాలమ్మ వార్షికోత్సవం

నవతెలంగాణ-కొండపాక



మండలం బందారం గ్రామంలో ఆదివారం మహాకాలమ్మ వార్షికోత్సవం వార్షికోత్సవాలు వైభవంగా జరిగాయి. వందల సంవత్సరాలు కలిగిన మహంకాలమ్మ దేవాలయాన్ని గత సంవత్సరం రెడ్డి సంఘం ఆధ్వర్యంలో పునర్ నిర్మాణం చేపట్టి ప్రతిష్ట మహెూత్సవాలు నిర్వహించారు. పునః ప్రతిష్ట జరిగి ప్రథమ సంవత్సరం కావడంతో ఆదివారం రెడ్డి సంఘం ఆధ్వర్యంలో వేద పండితులు ప్రత్యేక పూజ కార్యక్రమాలు నిర్వహించారు. హెూమంతో పాటు అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు నిర్వహించారు. మహిళలు అమ్మవారికి ఓడి బియ్యం సమర్పించారు. అనంతరం అన్న ప్రసాద వితరణ జరిగింది. గ్రామ సభ్యులతో పాటు వివిధ గ్రామాల నుంచి వచ్చిన భక్తులు పాల్గొని పూజలు నిర్వహించారు.

పచ్చిరొట్ట విత్తనాల కోసం రైతుల పడిగాపులు

- అవసరం మేరకు అందుబాటులో లేని విత్తనాలు



నవతెలంగాణ-గజ్వేల్

జిల్లాలో ఇప్పుడు పచ్చి రొట్టె విత్తనాల కోసం రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రైతులకు సరిపోను పచ్చిరొట్ట విత్తనాలు లేకపోవడం వల్ల గజ్వేల్, సిద్దిపేట, వర్గల్, ములుగు తదితర మండలాల్లో రైతులు పచ్చి రొట్టె విత్తనాల కోసం పడి కాపులు కాస్తున్నారు. నాలుగు సంచులు 40 మంది రైతులు పంచుకోమ్మనట్లు అరకొర స్టాక్ పెట్టి దుకాణాలలో అమ్మ చూపడంతో పచ్చిరొట్ట



విత్తనాలు దక్కించుకోవడం కోసం రైతులే ఒకరికొకరు గల్లలు పట్టుకుంటున్నారు. వ్యవసాయ అధికారులు సంఘటన స్థలానికి రాకుండా తప్పించుకుంటున్నారు. వర్గల్, గజ్వేల్ సిద్దిపేటలోని పలు మండలాలలో పచ్చిరొట్ట విత్తనాల కోసం రైతులు దుకాణాల వద్ద పడికాపులు కాస్తున్నారు. సీజన్ ముందు ఆయా మండలాలకు అవసరమైన విత్తనాలను ఇండెంట్ పంపి ముందుగా రైతులకు అందుబాటులో ఉంచే విధంగా చర్యలు చేపట్టడంలో వ్యవసాయ అధికారులు విఫలమైనట్లు రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మరో వారం రోజుల్లో పచ్చిరొట్ట విత్తనాల సాగు అదును తప్పుతుందని తద్వారా అనేక వేల ఎకరాల్లో సాగుకు వీల్లేకుండా పోతుందని రైతులు మండిపడుతున్నారు. స్టాక్ అందుబాటులో లేకపోవడంతో రైతుల నుంచి వ్యతిరేకత ఏర్పడడంతో వ్యవసాయ అధికారులు ఆ దరిదాపుల్లోకి రావడం లేదు. వచ్చిన కొద్దిపాటి స్టాక్‌ను ఆన్లైన్లో పర్మిట్లు ఇస్తున్నామని, చెబుతూ ఎవరికో తమ అనునాయులకు అంటగడుతున్నారని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పచ్చిరొట్ట విత్తనాలు కొరతతో రైతులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. అనేక మండలాల ఆగ్రో కేంద్రాల వద్ద రైతులు రోజుల తరబడి బారులు తీరుతున్నారు. వానాకాలం వరి సాగుకు సమయం ఆసన్నం కావడంతో ముందుగా పచ్చి రొట్ట విత్తనాల సాగు కోసం రైతుల్లో ఆత్రుత ఏర్పడింది. పచ్చిరొట్ట విత్తనాల కొరత తీవ్రంగా ఉండడంతో రైతులు నిరసన వ్యక్తం చేస్తున్నారు. వారానికి ఒకటి రెండు కేంద్రాలకు చాలిచాలనంతగా విత్తనాల సంచులను పంపడంతో రైతులు తగువులాడుకుంటున్నారు. వర్గల్ మండలం వేలూరు ఆగ్రో సర్వీస్ సెంటర్ వద్ద రైతులు భారీగా బారులు తీరగా స్టాక్ లేదని వ్యవసాయ అధికారులు చెప్పడంతో ఆందోళనకు దిగారు. గజ్వేల్‌లో అనేక గ్రామాల రైతులు రోజు దుకాణాల వద్దకు వచ్చి విత్తనాల కోసం పడిగాపులు కాస్తున్నారు. జీలుగ, జనుము విత్తనాలు సాగు చేయడం వల్ల నేల సారంగా మారుతుంది. ప్రధాన పంటకు వివిధ రకాల పోషకాలు అందుతాయి. రసానిక ఎరువులు కూడా ఆదా అవుతాయి. వరి సాగు చేస్తున్న రైతులు ముందుగా ఆయా పొలాల్లో పచ్చిరొట్ట రకాలను సాగు చేస్తారు. జీలుగా, జనం విత్తనాలను ప్రభుత్వం ప్రతి ఏటా విత్తనాలను రాయితీ పై రైతులకు అందిస్తుంది. బహిరంగ మార్కెట్లో కొందామన్న దొరకవు. జూన్ మొదటి వారం వరకు యాసంగి వరి కోతలు పూర్తయ్యాయి. రోహిణి కార్తిలో సన్న రకాలు ఆ తర్వాత దొడ్డు రకాలను వరి నార్లు పోస్తారు. ప్రస్తుతం వర్షాలు పడుతుండడం జీలుగా సాగుకు అనుకూలంగా ఉండటంతో రైతులు విత్తనాల కోసం దుకాణాల చుట్టూ తిరుగుతున్నారు. మండలానికో ఆగ్రో సర్వీస్ సెంటర్‌కు విత్తనాలు అమ్మకానికి అనుమతి ఇవ్వగా ఆ సెంటర్లలో స్టాక్ లేదని చెప్పడం వల్ల రైతులు ఆందోళనకు దిగుతున్నారు. వర్గల్ వేలూరు ఆగ్రోస్ కేంద్రానికి రెండుసార్లు తక్కువ మొత్తంలో స్టాకు రాగా రైతులకు సరిపోకపోవడంతో వివాదానికి దారితీసింది. వ్యవసాయ అధికారులు ఆన్లైన్లో పర్మిట్లు ఇస్తామని చెప్పి స్టాకు లేదని సెంటర్ వద్దకు పోయిన రైతులకు చెప్పడంతో ఆందోళన దిగారు. 20 కిలోమీటర్లు వెళ్లి విత్తనాలు దొరకకుండా తిరిగి రావడం వల్ల రైతులు వ్యవసాయ అధికారులపై మండి పడ్డారు. ఇప్పటికే కొన్ని గ్రామాల్లో సన్న రకాల వరిన నార్లు పోశారు. చాలామంది రైతులు పచ్చిరొట్ట విత్తనాల సాగు కోసం దుక్కి సిద్ధం చేసి పెట్టుకున్నా విత్తనాలు దొరకకపోవడంతో ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సీజన్‌కు సరిపడా విత్తనాలను ముందుగా స్టాక్ సిద్ధం చేసి పెట్టకపోవడం వల్ల వ్యవసాయ అధికారులు రైతులను తీవ్ర ఇబ్బందుల గురిచేస్తున్నట్లు చెబుతున్నారు. పచ్చిరొట్ట విత్తనాలకు సైతం రైతు క్యూకట్టవలసి రావడం ఆందోళన కలిగిస్తుంది. గజ్వేల్ నియోజకవర్గంలో సుమారు 800 బస్తాల వరకు పచ్చిరొట్ట విత్తనాలు అవసరం ఉన్నట్లు వ్యవసాయ అధికారులు చెప్తున్నారు. ఈ మేరకు ఇండెంట్ పెట్టిన స్టాక్ అందడం లేదని అంటున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం ఆయా ప్రాంతాలకు అవసరమైన పచ్చిరొట్ట విత్తనాలను వెంటనే అందుబాటులో ఉంచాలని రైతులు మొరపెట్టుకుంటున్నారు.



గజ్వేల్ రైతులు భూసార పరీక్షలకు నోచుకున్నారా?

నవతెలంగాణ -గజ్వేల్

భూసార పరీక్ష కేంద్రానికి అప్పుడప్పుడు తెలిసి దుమ్ము దులుపుతున్నారు. కానీ రైతులకు కావలసిన భూసార పరీక్షలకు మాత్రం నోచుకోవడం లేదు. భవనం నిర్మించి ఏడాది గడుస్తున్నా పరీక్షలు చేసేది లేదు. ఎవరి ప్రయోజనం కోసం ఈ భవనాన్ని నిర్మించారని రైతులు ప్రశ్నిస్తున్నారు. గజ్వేల్లో భూసార కేంద్రాన్ని ఏర్పాటు మయాలని తెలంగాణ తొలి ప్రభుత్వంలో అప్పటి వ్యవసాయ శాఖ మంత్రి పోచారం శ్రీనివాస్ రెడ్డి చేతుల మీదుగా పునాది రాయివేశారు. భూసార కేంద్రం గజ్వేల్ లో ఏర్పాటు చేయాలని అప్పటి ప్రభుత్వం భావించిన అమలుకు నోచుకోలేదు. లక్షలు పెట్టి కాంట్రాక్టర్ ప్రయోజనం కోసం భవనాన్ని నిర్మించి వారానికి ఒకసారి దుమ్ము దులుపుతున్నారు. ఎలాంటి సిబ్బందిని నియమించకుండా ఈ భవనాన్ని నిర్మించి ఏమి లాభమని ఎవరి ప్రయోజను కోసం భవనాన్ని నిర్మించారని ప్రశ్నిస్తున్నారు. ఏడాది క్రితం ఈ భవనాన్ని అప్పటి ప్రభుత్వంలో మంత్రిగా పనిచేసిన హరీష్ రావు ప్రారంభించారు. వ్యవసాయ డివిజన్ పరిధిలో రైతులు సాగు చేసుకుంటున్న పంటలకు అనుగుణంగా ఏ వంట వెయ్యాలనేది పరీక్షల ద్వారా రైతులకు అవగాహన కల్పించాలని ఉద్దేశంతో భూసార కేంద్రాన్ని గజ్వేల్ లో ఏర్పాటు చేస్తామని ప్రభుత్వం ప్రకటించింది. పంట దిగుబడును గణనీయంగా పెదగడానికి సూచనలు సలహాలు అవసరం ఉన్నందున భూసార పరీక్షలు తప్పనిసరి మట్టి నమూనాలు సేకరించి పరీక్షలు నిర్వహించి రైతులకు అవగాహన కల్పిస్తారు. గజ్వేల్ వ్యవసాయ మార్కెట్లో రూ. 31.20 లక్షలు ఖర్చుపెట్టి నిర్మించారు. పెట్రోల్ 21న 2083లో దీని ప్రారంభించారు. దీంతో భూసార పరీక్షలు ఎప్పుడు ప్రారంభమవుతాయో తెలియని పరిస్థితి ఉండని రైతులు భావి స్తుండగానే రాష్ట్రంలో బీఆర్ఎస్ ప్రభుత్వం పోయి కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఆరు నెలలు గడుస్తుంది. కాంగ్రెస్ ప్రభుత్వం సైతం భూసార పరీక్షలు చేయించాలనే ఆలోచనకు రానట్టు కనిపిస్తుంది. ఉమ్మడి మెదక్ జిల్లాలో ఎక్కడెక్కడ భూసార పరీక్ష కేంద్రాలు ఉన్నాయో ప్రభుత్వ మాత్రం తెలుసుకుందో లేదో అని రైతులు చర్చించుకుంటున్నారు.

ఈ క్రమంలో కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చింది. పరికరాలు, సిబ్బందిని కాంగ్రెస్ ప్రభుత్వం సమకాహర్చందా లేదా అనేది రైతులు ఎదురుచూస్తున్నారు. ప్రస్తుతానికి సిద్దిపేట జిల్లాలో కేవలం ఒకే ఒక భూసార కేంద్రం ఉండడంతో ఇప్పడికి రైతులు రంతో పాటు ఖర్చుతో కూడుకున్న మట్టి తీసుకొని భూసార పరీక్షకు వెళ్లేందుకు ముందుకు రావడం లేదు. భూసార పరీక్షలను చేరువ చేయాలన్న ప్రభుత్వ సంకల్పం నెరవేరేలా కనిపించడం లేదు. గజ్వెల్ కేంద్రంలోని సిబ్బందిని ఏర్పాటు వేసి రైతులకు ప్రయోజనం ఉండాలన్నారు. ఈ పరీక్ష



కేంద్రానికి ఏడిఏతో పాటు ఏవోలు, సిబ్బంది ల్యాబ్ అసిస్టెంట్లు, అవసరం ఉంది పరీక్షలు నిమిత్తం పరికరాలు కెమికల్స్ అవసరం ఉంటాయి కానీ వాటిని సమకూర్చడం లేదు.

గత ప్రభుత్వ నిర్లక్ష్యం చేసిందనే విమర్శలు రైతుల నుంచి వస్తున్నాయి. భూసార పరీక్షా కేంద్రం లేకపోవడంతో రైయలు ఇష్టారాజ్యంగా పంటలు సాగు చేసుకుంటున్నారు. భూసార పరీక్షలు జరగకపోవడంలో ఎరువులు వాడకం అధికమవుతుంది. సిద్దిపేట జిల్లాలో దాదాపుగా ఆరు లక్షల ఎకరాల్లో ఆయా పంటలు సాగిస్తున్నారు. నెల మట్టి రకం తెలియకపోవడంతో రైతులకు నష్టం వాటిల్లుతుంది. రైతులపై ఆర్థిక పరమైన భారమౌతుంది. భూసార పరీక్షలు నిర్వహిస్తే భూములు లోపాలను గుర్తించి అవసరమైన మేర ఎరువు వినియోగించే వీలుంటుంది. ఇటీవల రాష్ట్రంలో పదేళ్ల పాటు కాంగ్రెస్ అధికారంలోకి వచ్చింది. గజ్వేల్ ఎమ్మెల్యే కేసీఆర్ ఉన్నప్పటికీ మాజీ ముఖ్యమంత్రిగా మారిపోయారు. నిర్మించిన భూసార పరీక్షా కేంద్రకు కావలసిన పరికరాలు సిబ్బందిని సమకూర్చవలసిన అవసరం ఉంది. కాంగ్రెస్ ప్రభుత్వం అందించా రైతులు కోరుతున్నారు. గజ్వేల్లో ఉన్న భూసార పరీక్ష కేంద్రంలో ఇప్పటివరకు పరీక్షలు నిర్వహించలేరు. భూసార పరీక్ష కేంద్రానికి తాళం దర్శనమిస్తుంది. అప్పుడప్పుడు దుమ్ము దులిపేందుకు తాళం తీస్తున్నారు. మంగళవారం కూడా సంబంధిత శాఖ అధికారి భూసార పరీక్ష కేంద్రం తాళం తీసి దుమ్ము దులిపించారు. ఈ విషయంలో ఉమ్మడి జిల్లా మంత్రి కొండ సురేఖతో పాటు. జిల్లా మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్ పుణ్యం కట్టుకోదాని సేంద్రా సిబ్బంది కేటాయించాలి. గజ్వేల్ లో భూసార పక్ష కేంద్రానికి అధికార సిబ్బందిని కేటయించి పరీక్షలు ప్రారంభించేలా చేయాలని పలువురు రైతులు కోరుతున్నారు.

పాత బస్ స్టాప్‌లో ఎక్స్‌ప్రెస్, ఆర్డినరీ బస్సులు ఆపాలి

పూర్వకాలం నుంచి మొట్టమొదటి బస్ స్టాప్ ఇదే
ఆర్టీసీ ఆదేశాలు ఉన్నప్పటికీ డ్రైవర్ల నిర్లక్ష్యం



నవతెలంగాణ-నిజాంపేట

దాదాపు 60, 70 సంవత్సరాల నుంచి ఆర్టీసీ ఎక్స్‌ప్రెస్, ఆర్డినరీ బస్సులను మండల కేంద్రంలోని పాత బస్ స్టాప్‌లో ఆపేవారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత మహిళలకు బస్సు సౌకర్యం ఉచితం అన్నప్పటి నుంచి కొన్ని ఎక్స్‌ప్రెస్, ఆర్డినరీ బస్సులను ఆపడం లేదు. ఆర్టీసీ అధికారుల నుంచి పాత బస్టాప్ వద్ద, కొత్త బస్టాప్ వద్ద ఎక్స్‌ప్రెస్, ఆర్డినరీ బస్సులను ఆపాలని అధికారుల ఆదేశాలు ఉన్నప్పటికీ బస్ డ్రైవర్ల నిర్లక్ష్యం వలన బస్సులను ఆపడం లేదని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. వ్యాధిగ్రస్తులు, గర్భిణీ స్త్రీలు, బాలింతలు, వృద్ధులు, వ్యాదిగ్రస్తులు కొత్త బస్టాప్ వరకు నడిచి వెళ్లాలంటే దాదాపు కిలోమీటర్ ప్రయాణం చేయాల్సి వస్తుందని, నడవలేని పరిస్థితి ఉన్నదని ఆందోళన వ్యక్తం చేశారు. హైదరాబాద్, నిజామాబాద్, కామారెడ్డి, సిద్దిపేట, మెదక్ లాంటి నగరాలకు వెళ్లాలంటే నిత్యం వందల కొద్ది ప్రయాణికులు ఇబ్బందులకు గురవుతున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. పాత బస్టాప్ వద్ద బస్సు ఆపాలని ప్రయాణికులు డ్రైవర్లకు మొరపెట్టుకున్నప్పటికీ దురుసుగా ప్రవర్తిస్తున్నారని ఎవరికి చెప్పుకుంటారో చెప్పుకోండి అంటూ బెదిరిస్తున్నారని పలువురు వాపోతున్నారు. పాత బస్టాప్ వద్ద ఎక్స్‌ప్రెస్, ఆర్డినరీ బస్సులు ఆపనియెడల రాస్తారోకో ధర్నా కార్యక్రమాలు చేపడతామని గ్రామస్తులు హెచ్చరిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి వెంటనే పాత బస్టాప్ వద్ద ఎక్స్‌ప్రెస్, ఆర్డినరీ బస్సులను ఆపే విధంగా చర్యలు చేపట్టాలని పలువురు కోరుచున్నారు.

పాత బస్ స్టాప్‌లో బస్సులను ఆపాలి

మెరుగు నింగవ్వ, నిజాంపేట వాసి



నా వయసు దాదాపు 70 సంవత్సరాలు. నా చిన్నప్పటి నుంచి పాత బస్టాప్‌లోనే ఎక్స్‌ప్రెస్, ఆర్డినరీ బస్సులు ఆపేవారు. పాత బస్టాప్ నుండి కొత్త బస్ స్టాప్‌కు నడిచి వెళ్లాలంటే దాదాపు కిలోమీటర్ దూరం ఉన్నందున నడిచి వెళ్లలేని పరిస్థితి. గర్భిణీ స్త్రీలు బాలింతలు వృద్ధులు వ్యాధిగ్రస్తులు నడవలేని పరిస్థితి. ఆర్టీసీ అధికారుల ఆదేశాలు ఉన్నప్పటికీ బస్సు డ్రైవర్లు బస్సులను ఆపకపోవడం బాధాకరం. ఆర్టీసీ అధికారులు స్పందించి వెంటనే ఎక్స్‌ప్రెస్, ఆర్డినరీ బస్సులను ఆపే విధంగా తగు చర్యలు తీసుకోవాలి.

సంతోషిమాత ఆలయంలో కొనసాగుతున్న రజతోత్సవ వేడుకలు

నవతెలంగాణ-గజ్వేల్

గజ్వేల్‌లోని శ్రీ సంతోషిమాత ఆలయంలో రజతోత్సవ వేడుకలు కొనసాగుతున్నాయి. ఆదివారం ఆలయంలో ఇంటర్నేషనల్ వైశ్య ఫెడరేషన్ సిద్దిపేట జిల్లా అధ్యక్షులు ఎన్సీ సంతోష్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం పురోహితులు దేశపతి రాజశేఖర శర్మను శాలువాతో సత్కరించి మెమెంటో అందజేసి అభినందనలు తెలిపారు..ఈ సందర్భంగా ఎన్సీ సంతోష్ మాట్లాడుతూ ప్రజలను భక్తి మార్గం వైపు మళ్లే విధంగా రాజశేఖర శర్మ చేస్తున్న కృషి అభినందనీయమని 25 సంవత్సరాల ఆలయ వార్షికోత్సవ వేడుక, ఆలయ పునరనిర్మాణ సంకల్ప కార్యక్రమం ఘనంగా నిర్వహిస్తున్నందుకుగాను రాజశేఖర శర్మకు చిరుసన్మానం చేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో ఇంటర్నేషనల్ వైశ్య ఫెడరేషన్ సిద్దిపేట జిల్లా అధ్యక్షులు నేతి శ్రీనివాస్, నాయకులు గుడాల రాధాకృష్ణ, తోట అమరేందర్ రావు, దుబ్బకుంట లక్ష్మణ్, ఉత్తునూరి సంపత్, తోడుపునూరి బాలేష్, విష్ణు తదితరులు పాల్గొన్నారు.

